“ మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

“ మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 21-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 53 Issue: 53

20 ఆగస్టు 2026 - గురువారంశ్రీ పరాభవ నామ సంవత్సరందక్షిణాయనం - వర్ష ఋతువుశ్రావణ మాసం - శుక్లపక్షంసూర్యోదయం - ఉ. 6:03సూర్యాస్తమయం - సా. 6:35తిథిఅష్టమి రా. 9:20 వరకుతరువాత నవమిసంస్కృత వారంబృహస్పతి వాసరఃనక్షత్రంవిశాఖ ఉ. 9:02 వరకుతరువాత అనురాధయోగంఇంద్ర తె. 4:15వ వరకుకరణంవిష్టి ఉ. 8:16 వరకుబవ రా. 9:20 వరకువర్జ్యం. 1:35 నుండి మ. 3:22 వరకుదుర్ముహూర్తంఉ. 10:14 నుండి ఉ. 11:04 వరకుమ. 3:14 నుండి సా. 4:04 వరకురాహుకాలంమ. 1:53 నుండి మ. 3:27 వరకుయమగండంఉ. 6:03 నుండి ఉ. 7:37 వరకుగుళికాకాలంఉ. 9:11 నుండి ఉ. 10:45 వరకుబ్రహ్మముహూర్తంతె. 4:27 నుండి తె. 5:15 వరకుఅమృత ఘడియలురా. 12:16 నుండి రా. 2:03 వరకుఅభిజిత్ ముహూర్తంఉ. 11:54 నుండి మ. 12:44 వరకుగమనిక: “౦” అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## గీ ఉచితాలు అవసరమా?

**ప్రజల ట్యాక్స్‌ను ఇలా మళ్లించడం న్యాయమేనా?**

**కల్యాణలక్ష్మి పథకంపై హైకోర్టు వ్యాఖ్య**

**స్టే ఎత్తివేతకు ససేమిరా**

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలైన ‘కల్యాణలక్ష్మి’, ‘షాదీ ముబారక్’ లబ్ధిదారులకు భారీ షాక్ తగిలింది. ఈ రెండు పథకాలపై గతంలో విధించిన మధ్యంతర స్టేను ఎత్తివేయడానికి తెలంగాణ హైకోర్టు స్పష్టంగా నిరాకరించింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ ప్రభుత్వం చేసిన - 2 వ పేజీలో...

## 26న మిలాద్ ఉన్ నబీ సెలవు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): ఏపీ, తెలంగాణలో మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు తేదీని మార్చారు. ఏపీ సర్కారు గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటించగా.. తాజాగా ఆగస్టు 26, బుధవారానికి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనాన్ని పరిగణనలోకి -2 వ పేజీలో...



# మా ఫ్యూచర్‌తో ఆటలు

**బీటెక్ చదవకుండా చేస్తరా?.. రేవంత్‌కు తెలుగైనా రాయొస్తదా?.. ‘శక్తి’ స్కీమ్ పై భగ్గుమన్న విద్యార్థులు**



పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలకు అనుసంధానం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన శక్తి స్కీమ్ ను వ్యతిరేకిస్తూ పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులు వరుస ఆందోళనలను ఉధృతం అవుతున్నాయి. శక్తి స్కీం వల్ల తమకు బీటెక్ అనే ఆప్షన్ లేకుండా పోతుందని, బీటెక్ లేకపోతే తమ చదువు కొనసాగించలేమని, ఈ శక్తి స్కీం వస్తే లేబర్లుగా ఉండిపోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): రెండు, మూడు రోజుల నుంచి మేము ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం నుండి రెస్పాన్స్ లేదు, ఒక్కరూ పట్టించుకోవడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలు చేస్తుంటే ట్రాఫిక్ ఇబ్బందులు అవుతున్నాయని అంటున్నారే తప్ప, తమ భవిష్యత్తు గురించి ఎవరూ ఆలోచించడం లేదు అని పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా పాలిటెక్నిక్ చేసి బీఏ చేశాడని, మరి తాము న పాలిటెక్నిక్ చేసి బీటెక్ చేస్తే తప్పేంటి? అని ప్రశ్నిస్తున్నారు. డీఆర్డీవో లాంటి పెద్ద సంస్థలకు ఈ పాలిటెక్నిక్ విద్యార్థులే జూనియర్ ఇంజనీర్లుగా వెళ్తారని, లక్షలు పెట్టి ఇంజనీరింగ్ చేయలేని వాళ్లు ఈ పాలిటెక్నిక్ చేస్తారని, అలాంటి వాళ్లను లేబర్లుగా తయారు చేయాలని, రేవంత్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలకు -2 వ పేజీలో...

# పిల్లలతో ‘మెటా’ మూటలు

## భద్రత కన్నా లాభాలకే ప్రాధాన్యం

**‘డోంట్ ఆస్క్.. డోంట్ టెల్’ విధానం.. పిల్లలకు సోషల్ మీడియా అడిక్షన్**

**నియంత్రణ చర్యలు తీసుకోని సంస్థ.. కోర్టులో మాజీ ఉద్యోగి సంచలన సాక్ష్యం**






ఓ వైపు పిల్లల భద్రతే తమ ప్రాధాన్యమని మెటా చెబుతోంది.. మరోవైపు ఆ సంస్థలో పనిచేసిన మాజీ ఇంజినీర్ కోర్టులో చేసిన ఆరోపణలు ఇందుకు పూర్తి భిన్నమైన చిత్రాన్ని చూపిస్తున్నాయి. పిల్లలు, టీనేజర్లు సోషల్ మీడియాకు బానిసలవుతున్నారని తెలిసినా సంస్థ తగిన చర్యలు తీసుకోలేదని మాజీ మెటా ఇంజినీర్ ఆర్టురో బెజార్ కోర్టులో వాంగ్మూలం ఇవ్వడం సంచలనం రేపుతోంది. ముఖ్యంగా 13 ఏళ్లలోపు పిల్లల విషయంలో మెటా అనుసరించిన విధానం ‘డోంట్ ఆస్క్.. డోంట్ టెల్’లా ఉండేదని ఆయన ఆరోపించారు.

న్యూయార్క్: బెజార్ ప్రకారం.. పిల్లలు ఎంతసేపు ప్లాట్‌ఫారమ్‌లో ఉంటున్నారు? ఎంత తరచుగా తిరిగి వస్తున్నారు? అనే అంశాలపైనే ఉత్పత్తి రూపకల్పనలో ఎక్కువ దృష్టి ఉండేదని, వారి మానసిక ఆరోగ్యంపై పడే ప్రభావానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. వినియోగ సమయం పెరిగితే ప్రకటనల ఆదాయం పెరుగుతుంది.. అందుకే పిల్లలను ప్లాట్‌ఫారమ్‌పై -2 వ పేజీలో...

# సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతం

**ఆమె అభిప్రాయాలకు నేనెలా బాధ్యురాలిని?**

**క్రమశిక్షణ కమిటీకి మంత్రి సురేఖ వివరణ**



సీఎం రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంపై తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులకు స్పందిస్తూ, హైదరాబాద్‌లోని కమిటీ ఎదుట హాజరై ఈ మేరకు తన వివరణను సమర్పించారు.

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తం చేసిన రాజకీయ, వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరిని బాధ్యులను చేయడం సముచితం కాదని, అది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఈ సందర్భంగా సురేఖ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణమైన గౌరవం, విశ్వాసం ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో తన ప్రమేయం ఏమాత్రం లేదని... ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని కమిటీకి విజ్ఞప్తి చేశారు. మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) తరువాయి 2 వ పేజీలో...

# నేలమ్మ గొంతెండుతోంది!

**రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..**

**13 జిల్లాల్లో సాధారణం కంటే అధికం**

**వర్షాలు లేక రైతుల్లో ఆందోళన**



రాష్ట్రంలో వానాకాలం పంట సాగు కీలక దశకు చేరుకుంటున్న వేళ వాతావరణంలో భిన్న పరిస్థితులు రైతులను ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సాధారణం కంటే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండగా.. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో రుతుపవన వర్షాల లోటు ఉంది. ముఖ్యంగా తొమ్మిది జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వ్యవసాయ రంగాన్ని కలవరపెడుతోంది.

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): సాగు విస్తీర్ణం పెరుగుతున్న సమయంలో నేలలో తేమ, పంటల ఆరోగ్యం, సాగునీటి అవసరాలపై ఈ పరిస్థితులు ప్రభావం చూపే అవకాశం ఉంది. సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, నారాయణపేట, జనగామ, జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలతో పాటు వర్షపాతం లోటు నమోదవుతోంది. ఈ జిల్లాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో నేలలో తేమ తగ్గే పరిస్థితి ఏర్పడుతోంది. అదే సమయంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల భూమిలోని తేమ ఆవిరైపోయే -2 వ పేజీలో...



## భగ్గుమన్న బంగారం

**ఒక్కరోజే రూ.4,300 పెరుగుదల**

**3 నెలల గరిష్ఠ స్థాయికి పసిడి**

**కిలో వెండి రూ. 10,000 పెరుగుదల**

ముంబై: దేశీయ మార్కెట్లో పసిడి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కేవలం ఒక్క రోజులోనే భారీగా పెరిగిన బంగారం ధరలు, మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. గురువారం 10 గ్రాముల బంగారంపై సుమారు రూ. 4,300 నుంచి రూ. 4,600 వరకు పెరుగుదల నమోదైంది. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల-2 వ పేజీలో...




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,497 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,539 |

## విశ్వవాణి



### వై క్రోమోజోమ్‌కు ముప్పు లేదు!

మానవ ‘వై’ క్రోమోజోమ్ పరిణామ క్రమంలో జన్యువులను కోల్పోయినా, గత కొన్ని కోట్ల సంవత్సరాలుగా స్థిరంగా కొనసాగుతున్నందున త్వరలో కనుమరుగయ్యే అవకాశాలు తక్కువని పరిశోధనలు సూచిస్తున్నాయి. కొన్ని ఎలుక జాతులు వై క్రోమోజోమ్‌ను పూర్తిగా కోల్పోయినా, పురుష అభివృద్ధికి ప్రత్యామ్నాయ జన్యువును అభివృద్ధి చేసుకున్నాయి. లింగ నిర్ధారణలో పరిణామం కొత్త మార్గాలను సృష్టించగలదని, ఈ పరిశోధన క్రోమోజోమ్ పరిణామం, సంతానోత్పత్తిపై అవగాహన పెంచుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.




# విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్లస్ ఫ్రీ

**12 నెలల పాటు ఉచిత సేవలు**

న్యూఢిల్లీ: ఏఐ టూల్స్‌ను విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు గూగుల్ కీలక ప్రకటన చేసింది. భారతదేశంలోని కాలేజీ విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్లస్ సభ్యత్వాన్ని 12 నెలల పాటు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించింది. దీంతో విద్యార్థులు జెమినీ ఆధారిత అధునాతన ఏఐ టూల్స్‌ను పూర్తి ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. భారతీయ విద్యార్థుల కోసం గూగుల్ ప్రస్తుతం మూడు రకాల ఆఫర్లను ప్రకటించింది. గూగుల్ ఏఐ ప్లస్‌ను అర్హత కలిగిన విద్యార్థులు ఏడాది పాటు ఉచితంగా పొందవచ్చు. గూగుల్ ఏఐ ప్రోను నెలకు రూ.489 చొప్పున గరిష్ఠంగా నాలుగేళ్ల వరకు పొందే అవకాశం ఉంది. ఇక, యూట్యూబ్ ప్రీమియమ్‌తో కలిపిన తరువాయి 2 వ పేజీలో...



# పొంగులేటి సంస్థలకు రూ.15 వేల కోట్ల భూములు

**102 షెల్ కంపెనీల డేటా నా వద్ద ఉంది**

**బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి లక్ష్యంగా బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ నిషేధిత భూముల జాబితా, ‘భూ భారతి’ వ్యవహారాల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, పొంగులేటికి బహిరంగ చర్చకు సవాల్ తరువాయి 2 వ పేజీలో...



# మోదీ-షా పనైపోయింది

**వాళ్ల రాజకీయ అధ్యాయం ముగిసింది**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఎన్డీయేలో బీజేపీ రాజకీయ ఆధిపత్యం క్షీణించిందని... మోదీ, అమిత్ షా రాజకీయ ప్రయాణం ముగిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి స్వతంత్రంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఆ పార్టీ రాజకీయ శక్తి, పట్టు పూర్తిగా తరువాయి 2 వ పేజీలో...



# జార్ఖండ్ పరీక్షల రద్దుపై స్టే

**సోరెన్ సర్కారుకు హైకోర్టు షాక్**

**రద్దు నిర్ణయానికి తాత్కాలిక బ్రేక్**

రాంచీ: జార్ఖండ్ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహించిన పలు నియామక పరీక్షలను రద్దు చేస్తూ హేమంత్ సోరెన్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల భారీ ఆందోళనల నేపథ్యంలో, జార్ఖండ్ ప్రభుత్వం దాదాపు 44 రిక్రూట్‌మెంట్ పరీక్షల ఫలితాలు, నియామక ప్రక్రియను రద్దు తరువాయి 2 వ

## రాశి ఫలాలు

21.8.2026

మేషం: పనులు ముందుకు సాగక నిరాశ చెందుతారు. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు నత్తనడకన సాగుతాయి.

వృషభం: సంఘంలో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. చేపట్టిన పనులలో పురోగతి సాధిస్తారు. మిత్రుల నుంచి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఇతరులకు సహాయం అందిస్తారు.

మిధునం: చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ముఖ్యమైన నిర్ణయాలలో తొందరపాటు నిర్ణయాలు ఇబ్బంది కలిగిస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దైవ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. సంతానం విద్యా విషయాలు అనుకూలిస్తాయి.

కర్కాటకం: చేపట్టిన పనులలో ప్రతిబంధకాలు తప్పవు. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. బంధు మిత్రులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. సోదరులతో కలహ సూచనలు ఉన్నవి. వ్యాపారాలు, ఉద్యోగాలలో కొంత గందరగోళం ఉంటుంది.

కన్య: నూతన మిత్రుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు విషయంలో ఉన్న ఆటంకాలు తొలగి, అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

తుల: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

వృశ్చికం: వ్యయ ప్రయాసలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. బంధువులతో ఊహించిన వివాదాలు కలుగుతాయి. ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది తప్పదు. ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు కొంత మందగిస్తాయి.

ధనస్సు: ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహ పరుస్తాయి. దూర బంధువులతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. మిత్రులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

మకరం: నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. విద్యార్థుల పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు మరింత ఉత్సాహవంతంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు పరిష్కారమవుతాయి.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చేయాలి. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు చోటుచేసుకుంటాయి.

మీనం: చేపట్టిన పనులను మరింత ఉత్సాహంగా పూర్తి చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అప్పుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

# మా ఫ్యూచర్‌తో ఆటలు

మొదటి పేజీ తరువాయి

అనుసంధానం చేయాలని ఆదేశాలు ఇచ్చాడని ఆరోపించారు. 'మాకు అప్లికేషన్ రాయడం రాదు అని, ఇంజనీరింగ్ విద్య క్రిమినల్ వేస్ట్ అని సీఎం రేవంత్‌కు కనీసం తెలుగులోనైనా రాయడం వచ్చా?' అని రామోజీ ఫిల్మ్ సిటీ అబ్దుల్లా పూర్ మెట్టు వద్ద జరిగిన ఆందోళనలో ఓ పాలిటెక్నిక్ విద్యార్థి నిలదీశాడు. నాగర్ కర్నూల్ కల్వకుర్తి దగ్గర మా ఊరి పక్కనే సీఎం రేవంత్ ఊరు అని, ఆయనకు ఇంగ్లిష్ మాట్లాడటం రాదని, నాలుగు, ఐదు తరగతి చదివే మా తమ్ముళ్లు మాట్లాడుతారని విరుచుకుపడ్డాడు. మేం అందరం రేవంత్ రెడ్డి ముందు కూర్చొని లెటర్ రాస్తాం.. ఆయన రాయగలడా? మేము నిరసన తెలుపుతుంటే మగ పోలీసులు వచ్చి మా మీద చేతులు వేసి తోస్తున్నారు.. ఒక్క ఆడ పోలీసు లేదు, షీ టీమ్ లేదు అని విద్యార్థినిలు ఆరోపించారు. మా భవిష్యత్తు బాగుపడాలంటే ముందు మాకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఇవ్వండని డిమాండ్ చేశారు. అబ్దుల్లాపూర్ మెట్ వద్ద విద్యార్థులకు, పోలీసులకు మధ్య తోపులాట.. ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి బూతులు తిట్టారని విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేశారు. మాసబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కాలేజీ ఎదురుగా విద్యార్థులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేశారు. విద్యార్థుల పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తున్నాం: కేటీఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ మద్దతుగా నిలిచి ఆందోళనల్లో పాల్గొంటుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు, వారితో బీఆర్ఎస్వీ కలిసి చేస్తున్నపోరాటానికి పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తున్నట్టు ట్వీట్ చేశారు. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన వీడియోను ట్యాగ్ చేస్తూ.. రేవంత్ ప్రభుత్వం తీసుకున్న ఈ తప్పుడు నిర్ణయం వల్ల వేలాదిమంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారిందన్నారు. శాంతియుతంగా నిరసనను తెలుపుతున్న విద్యార్థుల మీద కొన్ని చోట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. విద్యార్థుల హక్కులను కాలరాయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే జీవో 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా. ఇప్పటికే పలు నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. ఇక ముందు కూడా పాలిటెక్నిక్ విద్యార్థుల పోరాటానికి అన్ని విధాలుగా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.



# గీ ఉచితాలు అవసరమా?

మొదటి పేజీ తరువాయి

అభ్యర్థనను తోసిపుచ్చిన న్యాయస్థానం, ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ పథకాలపై గురువారం జరిగిన విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం నిధుల దుర్వినియోగంపై ఘాటు వ్యాఖ్యలు చేసింది. 'రాష్ట్రంలో జీతాలు, పెన్షన్లు రాక చాలామంది ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉచిత పథకాల పేరుతో ప్రజాధనాన్ని వృధా చేయడం ఎంతవరకు సమంజసం? కష్టపడి పని చేసే ప్రజల ట్యాక్స్ డబ్బును ఇలా ఉచిత పథకాలకు మళ్లించడం న్యాయమేనా?' అంటూ న్యాయస్థానం నిలదీసింది. ప్రభుత్వ ప్రాధాన్యతలను తప్పుబడుతూ హైకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయి బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించింది. అర్హులైన భూ బాధితులకు ఇవ్వడానికి డబ్బులు లేవని చెప్తూ, శాసనసభ ఆమోదం లేని ఇటువంటి ఉచిత పథకాలకు వందల కోట్లు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిధుల లభ్యత,ప్రాధాన్యతలపై ప్రభుత్వం కోర్టుకు తప్పుడు అఫిడవిట్ సమర్పించిందని ధర్మాసనం సీరియస్ అయ్యింది. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేలా నివేదికలు ఇవ్వడంపై న్యాయమూర్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తదుపరి పూర్తిస్థాయి విచారణను హైకోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అప్పటివరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల నిధుల విడుదలపై స్టే యథాతథంగా కొనసాగనుంది.

# మోదీ-షా పనైపోయింది

మొదటి పేజీ తరువాయి

తగ్గిపోయాయని ఆయన విమర్శించారు. గతంలో చూపిన రాజకీయ ఆధిపత్యాన్ని మోదీ, అమిత్ షా జోడీ ఇప్పుడు కోల్పోయిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' కూటమి మరింత వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయాలని, రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాగా, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆత్మకథకు సంబంధించిన వివరాలను వారి తనయుడు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఈ సందర్భంగా తన తల్లిని ఉద్దేశించి ఆయన 'ఎక్స్' వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్ చేశారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో వెలువడనున్న ఈ పుస్తకం ద్వారా సోనియా గాంధీ వ్యక్తిగత జీవితం విశేషాలు బాహ్య ప్రపంచానికి తెలియనున్నాయి. "అమ్మా, నిన్ను, నాన్నను చివరిసారిగా కలిసి చూసి 35 ఏళ్లు గడిచాయి. నాన్న మనల్ని విడిచి వెళ్లిన నాటి నుంచి, జీవితంలో ఎదురైన ప్రతి సవాలును నువ్వు అంతులేని ధైర్యంతో, హుందాతనంతో ఎదుర్కోవడం నేను చూశాను. నాన్న మరణం తర్వాత నీ జీవితం ఎంతటి కష్టాల గుండా సాగిందో నాకు, ప్రియాంకకు మాత్రమే తెలుసు" అని రాహుల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. తన తల్లి అంతర్గత ప్రయాణాన్ని ప్రపంచంతో పంచుకోవడం గర్వంగా ఉందని, నేడు నాన్న కూడా నిన్ను చూసి ఎంతో గర్విస్తారని ఆయన ఆకాంక్షించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ ప్రచురణ సంస్థ 'ఆల్ఫ్రెడ్ ఎ. నాఫ్' (పెంగ్విన్ రాండమ్ హౌస్) ప్రచురిస్తోంది. నవంబర్ 10న ఇది అంతర్జాతీయంగా విడుదల కానుంది.

# సుస్మిత వ్యాఖ్యలు వ్యక్తిగతం

మొదటి పేజీ తరువాయి

సుమంత్‌పై తీవ్ర అభియోగాలతో కేసు నమోదైంది. ఓ వ్యాపారిని బెదిరించి రూ. 10 కోట్లు డిమాండ్ చేశారని, ఆ నగదు ఇచ్చేందుకు నిరాకరించడంతో దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో సుమంత్‌తో పాటు మరో ఐదుగురిని నిందితులుగా చేర్చారు. సుమంత్ నుంచి తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ ఓ వ్యాపారి పోలీసులను ఆశ్రయించారు. తనను రూ. 10 కోట్లు డిమాండ్ చేశారని, ఆ మొత్తం చెల్లించడానికి నిరాకరించడంతో తనపై భౌతిక దాడికి పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా తొలుత మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. అనంతరం, ఘటన జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో ఈ కేసును అక్కడికి బదిలీ చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ పోలీసులు సుమంత్‌తో పాటు మరో ఐదుగురిపై హత్యాయత్నం సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విద్యార్థులకు గూగుల్ ఏఐ ప్లస్ ఫ్రీ

మొదటి పేజీ తరువాయి

గూగుల్ ఏఐ ప్రో ధర నెలకు రూ.550గా ఉంది. విద్యార్థుల కోసం జెమినీలో ప్రత్యేక స్టూడెంట్ హబ్‌ను కూడా గూగుల్ ప్రవేశపెడుతోంది. చదువుకు సంబంధించిన వివిధ పనులను ఒకే చోట నిర్వహించుకునేలా దీన్ని రూపొందించింది. పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం, పరిశోధన చేయడం, పరీక్షలకు సిద్ధం కావడం, పునశ్చరణ చేసుకోవడం వంటి పనుల్లో విద్యార్థులకు ఇది సహాయపడనుంది. అలాగే జెమినీలో స్టడీ నోట్‌బుక్స్ అనే కొత్త ఫీచర్‌ను కూడా గూగుల్ అందిస్తోంది. విద్యార్థులు తమ తరగతి నోట్స్, పాఠ్యాంశాలను ఉపయోగించుకుని వ్యక్తిగతంగా స్టడీ షెడ్యూల్‌ను రూపొందించుకోవచ్చు. అంతేకాకుండా ఇంటరాక్టివ్ దృశ్యాలు, ప్రశ్నలు, పునశ్చరణ వంటి ఫీచర్లు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. విద్యార్థులకు కష్టంగా అనిపించే అంశాలను కేవలం సమాధానం చెప్పడం ద్వారా కాకుండా, వాటిని దశలవారీగా అర్థం చేసుకునేలా జెమినీ కొత్త విద్యా సాధనాలను అందిస్తుంది.

# పిల్లలతో 'మెటా' మూటలు

మొదటి పేజీ తరువాయి

ఎక్కువసేపు ఉంచే విధానాలకే ప్రాధాన్యం ఇచ్చారన్నది ఆయన వాదన. ఇక్కడే 'డోంట్ ఆస్క్.. డోంట్ టెల్' ఆరోపణ తీవ్రత బయటపడుతోంది. 13 ఏళ్లలోపు పిల్లలను గుర్తించే సామర్థ్యం ఉన్నప్పటికీ దాన్ని సమర్థంగా ఉపయోగించలేదని బెజార్ ఆరోపించారు. పిల్లలు తక్కువ వయసులో ఉన్నారని తెలిసినా వారిని గుర్తించి తొలగించడంలో సంస్థ తగినంత చొరవ చూపలేదని ఆయన పేర్కొన్నారు. అంటే.. పిల్లల వయసు తెలుసుకుంటే బాధ్యత పెరుగుతుంది.. తెలియనట్లు ఉంటే వినియోగదారుల సంఖ్య పెరుగుతుంది అనే వ్యాపార ధోరణి ఉందా? అన్న ప్రశ్న ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చకు వస్తోంది.

### 'అడిక్షన్' అనే పదాన్నే మార్చారా?

మాజీ ఉద్యోగి వాంగ్మూలంలో మరో కీలక అంశం సోషల్ మీడియా వ్యసనానికి సంబంధించినదే. 2019-2021 మధ్య తన రెండో దశ సేవలో మెటా 'అడిక్షన్' అనే పదానికి బదులుగా 'ప్రాబ్లమాటిక్ యూజ్' అనే పదాన్ని ఉపయోగించిందని బెజార్ తెలిపారు. అంటే సమస్యను తగ్గించి చూపించడానికి భాషనే మార్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం పదాల మార్పు కాదు. పిల్లలు సోషల్ మీడియాను అదుపు తప్పి ఉపయోగిస్తున్నారనే సమస్యను 'వ్యసనం'గా అంగీకరించకుండా, దాన్ని సాధారణ వినియోగ సమస్యగా చూపించే ప్రయత్నమా? అన్నది కీలక ప్రశ్న. బెజార్ తాను, ఇతర ఉద్యోగులు పిల్లల భద్రతపై సంస్థలో పలుమార్లు ఆందోళనలు వ్యక్తం చేశామని చెప్పారు. అయినా వాటిపై తగిన మార్పులు కనిపించలేదని ఆరోపించారు. మెటా ఉత్పత్తుల్లో పిల్లలకు హానికరమైన కంటెంట్ చేరే అవకాశాలపై కూడా ఆయన ఆందోళనలు వ్యక్తం చేసినట్లు కోర్టులో వివరించారు. ఇది కొత్త ఆరోపణ కూడా కాదు. గతంలో మాజీ ఫేస్‌బుక్ ఉద్యోగి ఫ్రాన్సిస్ హౌగెన్ వెల్లడించిన అంతర్గత పత్రాలు కూడా ఇన్‌స్టాగ్రామ్ యువతపై, ముఖ్యంగా టీనేజ్ బాలికలపై చూపే ప్రతికూల ప్రభావాలపై సంస్థకు అంతర్గతంగా అవగాహన ఉందన్న చర్చకు దారితీశాయి. మెటా ఇప్పటికే టీన్ అకౌంట్లు, తల్లిదండ్రుల నియంత్రణలు, సమయ పరిమితులు వంటి భద్రతా చర్యలు తీసుకున్నామని చెబుతోంది. అయితే విమర్శకులు మాత్రం ఈ చర్యలు స్వచ్ఛందంగా ఉండటం, వాటిని పిల్లలు సులభంగా అధిగమించే అవకాశాలు ఉండటం వంటి అంశాలను ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మెటా అంతర్గత పరిశోధనల్లో తల్లిదండ్రుల పర్యవేక్షణ, సమయ పరిమితులు వంటి నియంత్రణలు పిల్లల బలవంతపు సోషల్ మీడియా వినియోగాన్ని గణనీయంగా తగ్గించలేకపోయాయని వెల్లడైనట్లు నివేదికలు చెబుతున్నాయి.

### పిల్లలే ఆదాయ వనరులా?

పిల్లల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిసినా.. వారిని ఎక్కువసేపు స్క్రీన్ ముందు ఉంచే రూపకల్పన కొనసాగితే దాన్ని 'సాంకేతిక అభివృద్ధి' అని ఎలా పిలవాలి? వినియోగ సమయం పెరిగితే ప్రకటనల ఆదాయం పెరుగుతుందని భావించి పిల్లల బలహీనతలను ఉపయోగించుకుంటే.. అది వ్యాపారమా? లేక బాలల భద్రతపై రాజీనా? పిల్లల దృష్టిని ఆకర్షించడం వ్యాపార వ్యూహం కావచ్చు. కానీ వారి బలహీనతలను ఉపయోగించి ఆ దృష్టిని వ్యసనంగా మార్చడం మాత్రం సామాజిక బాధ్యతకు విరుద్ధం. అయితే, మెటా ఆరోపణలను ఖండిస్తోంది. అయితే కోర్టులో మాజీ ఉద్యోగి ఇచ్చిన వాంగ్మూలం లేవనెత్తిన ప్రశ్నలు మాత్రం చిన్నవి కావు. పిల్లలను రక్షించాల్సిన సంస్థే.. వారి బలహీనతలను వ్యాపార నమూనాలో భాగం చేసిందా? ఈ ప్రశ్నకు మెటా మాత్రమే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి సోషల్ మీడియా సంస్థ సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చింది.

# నేలమ్మ గొంతెండుతోంది!

మొదటి పేజీ తరువాయి

వేగం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 13 జిల్లాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యాయి. వీటిలో హైదరాబాద్, పెద్దపల్లి, వరంగల్, వనపర్తి జిల్లాల్లోనూ 33 డిగ్రీలు అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జూలై రెండో అర్థభాగంలో వర్షాలు కొంత మెరుగుపడటంతో రాష్ట్రవ్యాప్తంగా సాగు పనులు వేగం పుంజుకున్నాయి. దీంతో పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అయితే ప్రస్తుతం వివిధ పంటలు ఎదుగుదల దశల్లో ఉన్నాయి. ఈ దశలో సరైన తేమ అందకపోతే మొలక, మొక్క ఎదుగుదల, పూత, కాయల ఏర్పాటుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం వల్ల నేలతో పాటు పంట మొక్కల్లోనూ తేమ వేగంగా తగ్గుతుందని అంటున్నారు. రానున్న రెండు వారాల్లో వర్షాలు కురవకపోతే పంటలపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే పరిస్థితులు ఏర్పడుతున్నాయని కూడా నిపుణులు చెబుతున్నారు.



## భగ్గుమన్న బంగారం

మొదటి పేజీ తరువాయి

బంగారం ధర రూ. 1,62,000 మార్కును తాకగా, అంతకుముందు రోజు ఇది రూ. 1,58,000 వద్ద ఉంది. బంగారం బాటలోనే వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో వెండి ధర ఏకంగా రూ. 10,000 మేర పెరిగి రూ. 2,45,000కు చేరుకుంది. గత ఏడు వారాల కాలంలో వెండి ధర ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాలే బంగారం, వెండి ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా డాలర్ బలహీనపడటం, యూఎస్ బాండ్ ఈల్డ్స్ తగ్గడం వంటి అంశాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతుండటంతో డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

## జార్ఖండ్ పరీక్షల రద్దుపై స్టే

మొదటి పేజీ తరువాయి

చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే ఎంపికై, ఉద్యోగాల్లో చేరిన అభ్యర్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ రద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పలువురు బాధిత అభ్యర్థులు జార్ఖండ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ చేపట్టిన జస్టిస్ దీపక్ రోషన్ ధర్మాసనం... ప్రభుత్వ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ అభ్యర్థులకు ఊరటనిచ్చేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తదుపరి విచారణ కొనసాగనుంది.

## పొంగులేటి సంస్థలకు 15 వేల కోట్ల భూములు

మొదటి పేజీ తరువాయి

విసిరారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. తన సవాల్ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన మీడియా పాయింట్ వద్ద ఉన్నారు. అయినా, ఎవరూ రాకపోవడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు, ఫీనిక్స్ గ్రూప్ కంపెనీల నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో సంబంధాలున్న రాఘవ కన్ స్ట్రక్షన్స్ తదితర సంస్థలకు సుమారు రూ.15 వేల కోట్ల విలువైన భూములు, ఆస్తుల బదిలీలు అక్రమంగా జరిగాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. దాదాపు 102 షెల్ కంపెనీలకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కావాలనే భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి, ఆ తర్వాత కమీషన్లు, సెటిల్మెంట్ల కోసం రైతులను, భూ యజమానులను వేధిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేటు పట్టా భూములను సైతం ఈ జాబితాలో చేర్చి 'కలెక్షన్ సెక్షన్'లా మార్చేశారని విమర్శించారు. ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐ, ఈడీతో సమగ్ర విచారణ జరిపించాలని, అలాగే హౌస్ కమిటీ వేయాలని కోరారు. తన వద్ద ఉన్న సాక్ష్యాలను దర్యాప్తు సంస్థలతో పాటు రాహుల్ గాంధీకి కూడా లేఖ రూపంలో పంపుతానని తెలిపారు.

## 26న మిలాద్ ఉన్ నబీ సెలవు

మొదటి పేజీ తరువాయి

తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా మిలాద్ ఉన్ నబీ సెలవును ఆగస్టు 26కే ఖరారు చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే రోజు ఈ పండగకు ప్రభుత్వ సెలవు అమల్లో ఉండనుంది.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయాన్ని రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు గురువారం సందర్శించారు. దాదాపు 50 మంది రిటైర్డ్ అధికారులు తమ కుటుంబాలతో సహా సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం ముందు గ్రూప్ ఫోటో దిగారు.

# జీవో 97లో ఏముంది?

## విద్యార్థుల అభ్యంతరాలేంటి?.. ఉద్యోగుల ఆందోళనలు ఏంటి?.. ప్రభుత్వ జవాబుల కోసం డిమాండ్లు

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం 2026 జూలై 3న జారీ చేసిన జీవో నంబర్ 97 ప్రధానంగా రాష్ట్రంలోని నైపుణ్యాభివృద్ధి, శిక్షణ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడానికి సంబంధించినది. జీవో 97 ద్వారా కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖను పునర్వ్యవస్థీకరించి 'శక్తి' వ్యవస్థగా మార్చారు. 'శక్తి' అంటే నైపుణ్యం, మానవ వనరులు, జ్ఞాన శిక్షణ కార్యక్రమాలు అనే ఉద్దేశంతో కొత్త వ్యవస్థను రూపొందించారు. ఇప్పటివరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని 'శక్తి' వ్యవస్థ పరిధిలోకి తీసుకురావడానికి జీవో 97 మార్గం సుగమం చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వ్యవస్థతో అనుసంధానం చేయడం ఈ పునర్వ్యవస్థీకరణలో కీలక అంశం. అలాగే పారిశ్రామిక శిక్షణ సంస్థలు, శిక్షణా కేంద్రాలు వంటి నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఒకే వ్యవస్థ కిందకు తీసుకురావాలన్న ఉద్దేశం ఉంది. 2026-27 ప్రవేశాలపై వెంటనే ప్రభావం ఉండదని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం జరుగుతున్న 2026-27 పాలిటెక్నిక్ ప్రవేశ ప్రక్రియకు జీవో 97 వల్ల తక్షణ ఇబ్బంది ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.




**విద్యార్థుల ఆందోళనలు ఇందుకే..**

1. డిప్లొమా తర్వాత ఉన్నత విద్య పరిస్థితి ఏమిటి?

ప్రస్తుతం పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఈసెట్ ద్వారా ఇంజినీరింగ్ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలో చేరే అవకాశం ఉంది. జీవో 97 తర్వాత పాలిటెక్నిక్ వ్యవస్థ కొత్త నిర్మాణంలోకి వెళ్తే ఈ విధానం భవిష్యత్తులో ఎలా ఉంటుంది అనే అనుమానం విద్యార్థుల్లో ఉంది.

2. రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పాత్ర ఏమవుతుంది?

పాలిటెక్నిక్ విద్యలో ప్రస్తుతం రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి కీలక పాత్ర పోషిస్తోంది. పరీక్షలు, పాఠ్యప్రణాళిక, ధ్రువపత్రాలు, విద్యా ప్రమాణాలు వంటి అంశాల్లో దాని పాత్ర ఉంది. పాలిటెక్నిక్‌లను నైపుణ్య విశ్వవిద్యాలయ వ్యవస్థతో అనుసంధానం చేస్తే రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పాత్రలో ఎలాంటి మార్పులు వస్తాయి? అనేది విద్యార్థులు, అధ్యాపకులు తెలుసుకోవాలనుకుంటున్నారు.

3. ఈసెట్‌కు ఏమవుతుంది?

డిప్లొమా విద్యార్థులకు ఇంజినీరింగ్‌లో ఉన్నత విద్యకు వెళ్లేందుకు ఈసెట్ ఒక ముఖ్యమైన మార్గం. అందువల్ల విద్యార్థుల ప్రధాన ప్రశ్న ఏంటంటే.. "డిప్లొమా తర్వాత ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సరంలో చేరే అవకాశం యథావిధిగా కొనసాగుతుందా?" దీనిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

4. డిప్లొమా విద్యకు ఉన్న గుర్తింపు ఏమవుతుంది?

పాలిటెక్నిక్ విద్య కేవలం నైపుణ్య శిక్షణ కాదు. ఇది సాంకేతిక విద్యలో ప్రత్యేకమైన విద్యా విధానం. అందువల్ల నైపుణ్యాభివృద్ధి పేరుతో పాలిటెక్నిక్ విద్యను కొత్త వ్యవస్థలోకి తీసుకెళ్లేటప్పుడు డిప్లొమా విద్యా ప్రమాణాలు, గుర్తింపు, ఉన్నత విద్యకు ఉన్న అవకాశాలు తగ్గకూడదని విద్యార్థులు కోరుతున్నారు.

5. ఉద్యోగులకూ సమస్య

ఈ మార్పుపై పాలిటెక్నిక్ ఉద్యోగులు, అధ్యాపకులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉద్యోగ భద్రత ఏమవుతుంది? పదోన్నతుల విధానం మారుతుందా? బదిలీల పరిస్థితి ఏమిటి? ప్రస్తుత సర్వీస్ నిబంధనలు కొనసాగుతాయా? పాలిటెక్నిక్‌ల పరిపాలన ఎవరి ఆధీనంలో ఉంటుంది? రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పాత్ర తగ్గితే ఉద్యోగుల పరిస్థితి ఏమవుతుంది? ఈ అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. జీవో 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యను కొత్త నైపుణ్యాభివృద్ధి వ్యవస్థతో అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ మార్పుల తర్వాత డిప్లొమా విద్యార్థుల ఉన్నత విద్య, ఈసెట్, ఇంజినీరింగ్‌లో రెండో సంవత్సర ప్రవేశం, సాంకేతిక విద్యా మండలి పాత్ర వంటి అంశాలపై స్పష్టత లేకపోవడం విద్యార్థులు, ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమైంది.

# మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

సజ్జలపై సంగం డెయిరీ పరువునష్టం దావా

గుంటూరు, ఆగస్టు 20 (ఈవార్తలు): వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై ప్రముఖ పాల ఉత్పత్తి సంస్థ సంగం డెయిరీ రూ. 10 కోట్ల సివిల్ పరువునష్టం దావా వేసింది. తమ సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన అసత్య ఆరోపణలు చేశారని పేర్కొంటూ గుంటూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రైతుల నుంచి పాలు సేకరించకుండానే సంగం డెయిరీ తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) నెయ్యి సరఫరా చేస్తోందని ఇటీవల సజ్జల ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను సంగం డెయిరీ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లోని రైతుల నుంచి ఆవు పాలను సేకరించి, అత్యంత నాణ్యమైన నెయ్యిని టీటీడీకి అందిస్తున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) గోపాలకృష్ణన్ గుంటూరు కోర్టును ఆశ్రయించారు. సజ్జల చేసిన వ్యాఖ్యలు సంస్థ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే కాకుండా, టీటీడీకి సరఫరా చేసే నెయ్యి విషయంలో భక్తుల మనోభావాలను కూడా గాయపరిచాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో సజ్జలతో పాటు, ఇదే తరహా ఆరోపణలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు, ఈ వ్యాఖ్యలను ప్రసారం చేసిన సాక్షి టీవీ, ఇతర సోషల్ మీడియా వేదికలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సంస్థ ప్రతిష్ఠను కాపాడుకునేందుకే న్యాయపరమైన చర్యలు చేపట్టినట్లు సంగం డెయిరీ యాజమాన్యం వెల్లడించింది.

# పాలిటెక్నిక్‌ల బలోపేతానికే పునర్వ్యవస్థీకరణ

**విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలకు పూర్తి రక్షణ**

**మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టీకరణ**

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడం, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్), గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పాలిటెక్నిక్‌లను కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధి నుంచి కమిషనరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం జూన్ 16, 2026న జీఓ 97 జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఈ నిర్ణయం పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయడానికి, దాని గుర్తింపును మార్చడానికి కాదని.. కేవలం పరిపాలనా పునర్వ్యవస్థీకరణ మాత్రమేనని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు/అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలను ఒకే సమగ్ర వ్యవస్థలోకి తీసుకురానున్నట్లు తెలిపారు.





## సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

**దక్షిణాది అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి పరుగులు**

**కాళేశ్వరం, పాలమూరుకు కేంద్రం సాయం ఇవ్వాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి**

మహాబలిపురం, ఆగస్టు 20 (ఈవార్తలు): కేంద్ర-రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించి, తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో తెలంగాణ వైఖరిని ఆయన స్పష్టం చేశారు. కృష్ణా జలాల విషయంలో చట్టపరమైన వ్యవస్థల ప్రకారం తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా కల్పించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల ప్రయోజనాలను పరిరక్షించాలని, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014కు సంబంధించిన పెండింగ్ సమస్యలను ఇకపై ఉత్తర ప్రత్యుత్తరాలకు పరిమితం చేయకుండా తుది నిర్ణయాలతో పరిష్కరించాలని భట్టి కోరారు. 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు.

## శ్రీవారి భక్తుల భద్రత కోసం రోబోట్ డాగ్

తిరుమల, ఆగస్టు 20 (ఈవార్తలు): తిరుమలలో వన్యప్రాణుల కదలికల పర్యవేక్షణ, శ్రీవారి భక్తుల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు టీటీడీ చర్యలు చేపడుతోంది. ఇందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ఆలోచన చేస్తోంది. అందులో భాగంగా గురువారం తిరుమల పద్మావతి అతిథి గృహం వద్ద నాలుగు కాళ్ల రోబోట్ డాగ్ పనితీరును టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి పరిశీలించారు. అటవీ ప్రాంతాల్లో మనుషులు వెళ్లేందుకు ఇబ్బందికరమైన, ప్రమాదకరమైన ప్రాంతాల్లో వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించేందుకు ఈ రోబోట్ డాగ్‌ను వినియోగించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఈ రోబోట్ డాగ్‌లో ఆప్టికల్ కెమెరా, థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్, సెన్సార్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉన్నాయి. వీటి సహాయంతో చీకటి, పొగమంచు వంటి సమయాల్లోనూ వన్యప్రాణుల కదలికలను గుర్తించి పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

# పొంగులేటిపై వేటేయాలి

**'22ఏ' పేరుతో భూముల అవకతవకలు**

**రెవెన్యూ శాఖలో 30 శాతం కమీషన్లు**

**రాహుల్ గాంధీకి హరీశ్‌రావు లేఖ**

హైదరాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): తెలంగాణలో సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా భూముల వ్యవహారంలో అవకతవకలు జరుగుతున్నాయంటూబీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి.. హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అనుమతులు ఉన్న ప్రైవేటు ఆస్తులను కూడా 22ఏ నిషేధిత జాబితాలోకి ఎక్కించి.. యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సెక్షన్ 22ఏ ఉద్దేశం నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లను అడ్డుకోవడమే తప్ప.. ప్రైవేటు ఆస్తులపై కొత్తగా వివాదాలు సృష్టించి వసూళ్లకుపాల్పడటం కాదని హరీశ్ రావు తన లేఖలో పేర్కొన్నారు. దశాబ్దాల క్రితమే అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) కింద క్రమబద్ధీకరించిన భూములు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు ఉన్న ఆస్తులను కూడా మళ్లీ 22ఏ జాబితాలో చేర్చి స్తంభింపజేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ శాఖలో 30 శాతం కమీషన్ వసూళ్ల రాకెట్ నడుస్తోందని హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించుకునేందుకు దళారులు మార్కెట్ విలువలో 30 శాతం వరకు కమీషన్ డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పరిసరాల్లోని భూములపై వివాదాలు సృష్టించి.. రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాలు చేసుకునేలా భూ యజమానులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలను హరీశ్ రావు లేఖలో ప్రస్తావించారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరారు. యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చినట్లు 4 నెలల క్రితం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విషయాన్ని కూడా హరీశ్ రావు తన లేఖలో ప్రస్తావించారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపై రిటైర్డ్ హైకోర్టు జడ్జి స్వతంత్ర విచారణ జరిపించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 30 శాతం కమీషన్లు, 50:50 జాయింట్ డెవలప్‌మెంట్ ఒప్పందాల వెనుక ఉన్న వ్యక్తులు, దళారులు, బినామీ సంస్థలపై విచారణ జరపాలని కోరారు. అదే సమయంలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి.. ఏ ఆస్తిని ఎవరు 22ఏ జాబితాలో చేర్చారు.. ఎందుకు చేర్చారు.. ఎవరి ఆదేశాలతో తొలగించారు.. మధ్యవర్తుల ప్రమేయం ఉందా.. ఆర్థిక లావాదేవీలు జరిగాయా.. అనే అంశాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారీగా 22ఏ నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా హరీశ్ రావు కోరారు. ఏ భూమిని ఎప్పుడు జాబితాలో చేర్చారు.. ఎవరి ఆదేశాలతో తొలగించారు అనే వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలు అవాస్తవమైతే ప్రభుత్వం వెంటనే స్వతంత్ర విచారణకు ఆదేశించి తన నిజాయితీని నిరూపించుకోవాలని హరీశ్ రావు సవాల్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని లేఖలో పేర్కొన్నారు.



# పంటల బీమా నమోదు గడువు పొడిగింపు

అమరావతి, ఆగస్టు 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రైతులకు ముఖ్య గమనిక. పంటల బీమా నమోదు గడువును ప్రభుత్వం పొడిగించింది. ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో.. రైతులందరూ ముందస్తు జాగ్రత్తగా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. పంటల బీమా కోసం కట్టాల్సిన ప్రీమియం నగదు చాలా తక్కువ మొత్తంలోనే ఉంటుందని.. బీమా నమోదు చేసుకోవడానికి ఈ నెలాఖరు వరకూ మాత్రమే (ఆగస్టు 31) గడువు ఉందని తెలిపారు. రైతులు ఎవరూ ఆలస్యం చేయకుండా వెంటనే సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.



## భీమన్న ఆలయంలో ప్రసాదాల నాణ్యతపై తనిఖీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 20 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర ఆలయంలోని లడ్డూ కౌంటర్‌ను దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల నాణ్యతను పరిశీలించిన ఆమె.. భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కౌంటర్ల వద్ద పారిశుద్ధ్య పరిస్థితులు, రికార్డులను పరిశీలించారు. ప్రసాదాలు కొనుగోలు చేసిన భక్తులు, చిన్నారులతో స్వయంగా మాట్లాడి నాణ్యతపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. భక్తుల సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. డ్యూటీకి గైర్హాజరైన సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించిన ఈవో.. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఏజెన్సీ సిబ్బంది తప్పనిసరిగా దుస్తుల నియమావళి పాటిస్తూ గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. తనిఖీల్లో డీఈవో నవీన్ కుమార్, ఏఈవో జయకుమారి, దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి పెరిక శ్రీనివాస్, పర్యవేక్షకులు వెల్ది సంతోష్, నులిగొండ రాజేందర్, జూనియర్ అసిస్టెంట్ అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ వివరాలను పీఆర్వో పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.



## ఎండపల్లిలో కాంగ్రెస్ కార్యాలయం

**మినీ క్యాంపు కార్యాలయంగా తీర్చిదిద్దుతాం: మంత్రి అడ్లూరి**

ఎండపల్లి, ఆగస్టు 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో నిర్మించనున్న కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ నిర్మాణ పనులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్‌రెడ్డితో కలిసి కార్యాలయ స్థలాన్ని సందర్శించిన మంత్రి నిర్మాణ పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన కార్యాలయాన్ని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే మినీ క్యాంపు కార్యాలయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా చేరవేసే కేంద్రంగా కార్యాలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోల్ల తిరుపతి, ఎండపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, పార్టీ కార్యదర్శి కందికట్ల రాజేష్, వెల్గటూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ధర్మారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాజారాంపల్లి సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంఘ రమేష్, కోటిలింగాల ఆలయ చైర్మన్ పూదరి రమేష్, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కోరుట్లలో అథ్లెటిక్స్ సందడి

కోరుట్ల, ఆగస్టు 20 (ఈవార్తలు): కోరుట్ల కాలేజ్ గ్రౌండ్‌లో 12వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ (సౌత్ జోన్) పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే.. పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. 60, 100, 200, 400, 600, 800, 1000 మీటర్ల పరుగు విభాగాల్లోనూ పోటీలు జరుగుతున్నాయి. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా అధికారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వందేమాతరంపై కాంగ్రెస్ వైఖరి సరికాదు

**దేశభక్తికి ప్రతీకైన గేయాన్ని పూర్తిగా ఆలపించాలి: ఏసీఎస్ రాజు**

జగిత్యాల, ఆగస్టు 20 (ఈవార్తలు): వందేమాతరం గేయంలోని రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న కాంగ్రెస్ నిర్ణయం సరికాదని భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు విమర్శించారు. జగిత్యాల పట్టణంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేమాతరం గేయం దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని, స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో స్ఫూర్తిని నింపిందని తెలిపారు. అలాంటి గేయాన్ని పూర్తిగా ఆలపించకుండా రెండు చరణాలకే పరిమితం చేయాలన్న నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని డిమాండ్ చేశారు. దేశాన్ని, మాతృభూమిని గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. సమావేశంలో చిట్ల గంగాధర్, 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, నరేందుల శ్రీనివాస్, ఆర్ఎస్ఎస్ వీరన్న, కొత్తకొండ బాలన్న, ఎడమల వెంకటరెడ్డి, ఇల్లెందుల పురుషోత్తం, బొద్దుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ విచ్ఛిన్నానికి రేవంతే కారణం

**నూకపల్లి కాలనీలో మౌలిక వసతులు శూన్యం.. పెండింగ్ ఇళ్లు, ఇందిరమ్మ బిల్లులు వెంటనే పరిష్కరించాలి: జీవన్‌రెడ్డి**

జగిత్యాల, ఆగస్టు 20 (ఈవార్తలు): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణమని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. నూకపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జగిత్యాల తెలంగాణ భవన్‌లో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేశ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదల కోసం గతంలో 4 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని, 2023 ఎన్నికలకు ముందు సుమారు 3,500 మందికి పట్టాలు పంపిణీ చేశారని తెలిపారు. అయితే మూడేళ్లు గడిచినా లబ్ధిదారుల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. నూకపల్లి కాలనీలో సుమారు 4 వేల కుటుంబాలు నివసిస్తున్నా ఓటర్ల నమోదు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. 1,200 మంది ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాలనీలో రేషన్ దుకాణం, పాఠశాల, రవాణా సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రేషన్ కోసం పాత ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. నూకపల్లిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనే కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. 2009లో మంజూరైన నూకపల్లి అర్బన్ హౌసింగ్‌లో 1,625 ఇళ్లు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మిగిలిన వాటితో పాటు ఎల్2 లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పూర్తి బిల్లులు చెల్లించాలని, భూభారతి, 22ఏ భూములకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను



పరిష్కరించాలని కోరారు. రెండేళ్లలో రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారుతుందని ఆయన జోస్యం చెప్పారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ దేవేందర్ నాయక్, శీలం ప్రవీణ్, ముఖాసీర్ అలీ నిహాల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాలపై ప్రశ్నిస్తే తప్పేంటి?

**దమ్ముంటే అవినీతిని నిరూపించండి**

**బఫర్‌జోన్ ఇళ్లపై ఎందుకు చర్యలు లేవు?**

**బీఆర్ఎస్‌పై బురద చల్లే ప్రయత్నం: మాధవి రాజు**

వేములవాడ అర్బన్, ఆగస్టు 20 (ఈవార్తలు): తమ హయాంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, అక్రమ నిర్మాణాలపై ప్రశ్నించడం తప్పేంటని వేములవాడ మున్సిపల్ మాజీ చైర్మన్ రామతీర్థపు మాధవి రాజు ప్రశ్నించారు. వేములవాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తనపై వస్తున్న ఆరోపణలను ఖండించిన మాధవి రాజు.. దమ్ము, ధైర్యం ఉంటే తమ హయాంలో జరిగిన అవినీతిని నిరూపించాలని సవాల్ చేశారు. అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు చులకన కావద్దని సూచించారు. చేపూరి మధుకు బీఆర్ఎస్‌తో ఎలాంటి సంబంధం లేదని, కావాలనే తమ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 24వ వార్డులో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది ఎవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బఫర్‌జోన్‌లో ఉన్న ఇళ్లను కూల్చివేస్తామని గతంలో చెప్పిన అధికారులు.. ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 35 నుంచి 40 మందికి నోటీసులు ఇచ్చి, వారి ఇళ్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ప్రజలకు వివరించాలని కోరారు. తమకు మున్సిపల్ పాలనపై అనుభవం ఉందని, అందుకే అవినీతిపై ప్రశ్నిస్తున్నామని మాధవి రాజు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో ఐదుసార్లు గెలిచామని, 9, 10వ వార్డుల ప్రజలే తమకు దేవుళ్లని పేర్కొన్నారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించాలని మరోసారి సవాల్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంగళ శ్రీకాంత్ గౌడ్, అనిత, వాసాల శ్రీనివాస్, లావణ్య, నాయకులు ఏనుగు తిరుపతిరెడ్డి, నిమ్మచెట్టి విజయ్, గోలి మహేష్, సిరిగిరి రామచంద్రం, గూడూరి మధు, కొండ నరసయ్య, కనకయ్య, నీలం శేఖర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



## రాజారాంపల్లిలోనే మండల కార్యాలయాలు

**గ్రామస్థుల ధర్నా.. రహదారిపై ఆందోళన**

ఎండపల్లి, ఆగస్టు 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ రాజారాంపల్లిలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. కరీంనగర్--రాయపట్నం రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించి తమ డిమాండ్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. రవాణా, ఇతర మౌలిక సదుపాయాల పరంగా రాజారాంపల్లి మండల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకోవడానికి కూడా ఈ ప్రాంతం సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. మండల కార్యాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల కార్యాలయాలను కూడా రాజారాంపల్లిలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాజారాంపల్లిలోనే కార్యాలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.

## నేడు జగిత్యాలలో పొంగులేటి పర్యటన



జగిత్యాల, ఆగస్టు 20 (ఈవార్తలు): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు ధరూర్ క్యాంప్‌కు చేరుకోనున్న మంత్రి.. జగిత్యాల, మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, భీమారం, ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయాలు, మాల్యాల, మెట్పల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీకి చేరుకుని 1 గంట నుంచి 1.30 గంటల వరకు కాలనీని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు జగిత్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో గృహ నిర్మాణం, రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. మంత్రి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## కంటి ఆరోగ్యంపై అవగాహనకు పెద్దపీట

**లయన్స్ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన**



వేములవాడ అర్బన్, ఆగస్టు 20 (ఈవార్తలు): విద్యార్థుల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చక్రవర్తి ఐ కేర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరానికి విద్యార్థులు, కళాశాల సిబ్బంది నుంచి విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బచ్చు వంశీకృష్ణ, కొమ్మ నటరాజ్, డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలను గుర్తించి, అవసరమైన వారికి వైద్యులు తగిన సూచనలు, సలహాలు అందించారు. కంటి చూపు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యలు ఎదురైనప్పుడు పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బచ్చు వంశీకృష్ణ కోరారు. విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం ద్వారా సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం లభించిందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు కట్కూరి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు మోటూరి శ్రీనివాస్, చీకోటి సంతోష్, శంకరయ్య, రవీందర్, విష్ణు, శరణ్య, అస్మా, ఛూత్రా, సుధాకర్, తాటికొండ శ్యామ్, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## భూగర్భ జలాల పరిరక్షణే లక్ష్యం

**ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించాలి: పుల్కం రాజు**

వేములవాడ అర్బన్, ఆగస్టు 20 (ఈవార్తలు): భావితరాలకు మంచినీటి కొరత లేని భవిష్యత్తును అందించేందుకు వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చే ఇంకుడు గుంతలను ప్రతి ఇంట్లో నిర్మించాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నమూనా ఇంకుడు గుంత నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షం కురిసినప్పుడు ప్రతి నీటి బొట్టు మురుగు కాలువల్లోకి వెళ్లి వృథా కాకుండా నేలలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతలు పట్టణంలో నీటి భద్రతకు కీలకమని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పురపాలక అధికారులు ప్రతి వార్డులో పర్యటించి ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గృహ యజమాని తమ ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసి నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్, పాలకవర్గ సభ్యులు, కో-ఆప్షన్ ప్రతినిధులు, అధికారులు, వార్డు కౌన్సిలర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణపై అవగాహన

గంగాధర, ఆగస్టు 20 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వివిధ వ్యాధుల నివారణ, ఇంటి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. మాతృ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నారు. సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రాథమిక వైద్యాధికారి సౌమ్యతో పాటు ఇతర అధికారులు సదస్సుకు హాజరై ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేయనున్నారు. గ్రామ ప్రజలు సదస్సుకు హాజరై కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.





## బోయిగూడలో రాజీవ్‌గాంధీకి నివాళి

సికింద్రాబాద్, ఆగస్టు 20 (ఈవార్తలు): భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సికింద్రాబాద్ న్యూబోయిగూడలోని ఐడీహెచ్ కాలనీలో ఉన్న ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.ఎం. రాజు, ఐత చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ దేశంలో సమాచార సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు రాజీవ్‌గాంధీ బాటలు వేశారని అన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీ ఆసుపత్రిలో బోనాల వేడుకలు

పద్మారావునగర్, ఆగస్టు 20 (ఈవార్తలు): శ్రావణమాసం సందర్భంగా గాంధీ ఆసుపత్రిలో జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రోగి సహాయకుల విశ్రాంతి భవనం నుంచి ఆసుపత్రి ఆవరణలోని అమ్మవారి ఆలయం వరకు భక్తిశ్రద్ధలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఎస్. నరసింహమూర్తి, సభ్యులు నందకుమార్, శ్రీధర్, వసుమతి, శోభా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మళ్లీ యుద్ధం అంటే చుక్కలు చూపిస్తాం

### కొత్త ఆయుధాలు బయటికి తీస్తాం: ఇరాన్

టెహ్రాన్: తమ దేశంపై మరోసారి బలవంతంగా యుద్ధాన్ని రుద్దితే, ఈసారి మరింత విధ్వంసకరమైన, అత్యాధునిక ఆయుధాలను ప్రయోగిస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. గతంలో జరిగిన యుద్ధాల తర్వాత తమ సైనిక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకున్నామని, ఇప్పుడు మొదలయ్యే ఎలాంటి ఘర్షణలోనైనా తమ ఆయుధాలు భిన్నంగా ఉంటాయని స్పష్టం చేసింది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధికార ప్రతినిధి హుస్సేన్ మొహెబ్బి గురువారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత ఏడాది జూన్, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ మాపై రుద్దిన యుద్ధాల తర్వాత మా సైనిక శక్తిని విస్తరించుకున్నాం. ఒకవేళ కొత్తగా యుద్ధం ప్రారంభమైతే, మా క్షిపణుల వార్‌హెడ్‌లు, వాటి కచ్చితత్వం, పరిధి విషయంలో భారీ మార్పులు ఉంటాయి. గతంలో వాడిన వాటి కంటే కొత్త క్షిపణుల విధ్వంసక శక్తి చాలా ఎక్కువగా ఉంటుంది" అని ఆయన వివరించారు. ఆయుధాల ఉత్పత్తిని ఇరాన్ ఎన్నడూ ఆపలేదని ఆయన నొక్కిచెప్పారు. మరోవైపు, అమెరికాతో రహస్య చర్చలు జరుగుతున్నాయంటూ ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మొహెబ్బి ఖండించారు. ఐఆర్‌జీసీ అధికారులు అమెరికన్లతో ఎలాంటి చర్చలు జరపడం లేదని, ట్రంప్ వ్యాఖ్యలు కేవలం 'భ్రమ' అని కొట్టిపారేశారు. వాషింగ్టన్ తన వాగ్దానాలను నిలబెట్టుకోకపోవడం వల్లే ప్రస్తుతం ఆ దేశంతో దౌత్యపరమైన చర్చలు కూడా జరగడం లేదని ఆయన తెలిపారు. ఇదే విషయంపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి కూడా స్పందించారు. ఇరాకీ కుర్దిస్థాన్ అధికారుల ద్వారా అమెరికాతో రహస్యంగా సమావేశమయ్యారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని అన్నారు. ఇరాన్ నిర్ణయాధికార వ్యవస్థలో విభేదాలు సృష్టించేందుకు పన్నుతున్న మీడియా ఎత్తుగడలు, మానసిక యుద్ధంలో భాగమే ఈ ప్రచారమని ఆయన ఆరోపించారు. గతంలో ఇరుపక్షాల మధ్య ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం, జూన్ 18న యుద్ధాన్ని ముగించేందుకు అవగాహన ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మాత్రం తరచుగా కొనసాగుతూనే ఉన్నాయి.



# స్వాతంత్ర్య యోధులకు కాంగ్రెస్ అవమానం

### కాంగ్రెస్‌పై అమిత్ షా ఫైర్



న్యూఢిల్లీ: వందేమాతరం విషయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలనే పాడాలన్న నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇది సాధారణ నిర్ణయం కాదని.. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులను అవమానించడమేనని ఆరోపించారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని మళ్లీ అమలు చేయడం ద్వారా అప్పటి తప్పిదాన్ని పునరావృతం చేస్తోందని విమర్శించారు. "1937లో ముస్లిం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ వందేమాతరాన్ని రెండు భాగాలుగా చేసింది. అదే దేశ విభజనకు బీజం వేసింది. అక్కడి నుంచి ద్విజాతి సిద్ధాంతానికి బలం వచ్చింది. చివరకు దేశం విడిపోయి పాకిస్థాన్ ఏర్పడింది" అని షా ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ మళ్లీ అదే నిర్ణయాన్ని అమలు చేస్తోందని అన్నారు. బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని షా పేర్కొన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ బంకించంద్రుడి గొప్ప రచనను మాత్రమే కాదు.. "వందేమాతరం" అంటూ ఉరికంబాలు ఎక్కిన లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులను కూడా అవమానిస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లు జైళ్లలో గడిపిన వీరుల త్యాగాలను కూడా విస్మరిస్తోందని అన్నారు. వందేమాతరం రచనకు 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దే ప్రయత్నం చేసిందని షా తెలిపారు. దేశ ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు పూర్తి వందేమాతరాన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. దీనికి అధికారిక మార్గదర్శకాలు కూడా జారీ చేశామని వెల్లడించారు.

## 3 భాషల విధానంపై
# సుప్రీం అభ్యంతరం

### ప్రణాళికను పునఃపరిశీలించాలని సీబీఎస్ఈకి ఆదేశం



న్యూఢిల్లీ: సీబీఎస్ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ 2020) అమలును తాము వ్యతిరేకించడం లేదని, అయితే దీనిని అమలు చేసే క్రమంలో విద్యార్థులపై అనవసర ఒత్తిడి పడకూడదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఈ విధానం యొక్క ఆచరణాత్మక అమలుపై మరోసారి సమగ్రంగా అధ్యయనం చేయాలని బోర్డును ఆదేశించింది. ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి వచ్చేసరికి మూడో భాషలో కూడా తప్పనిసరిగా బోర్డు పరీక్ష రాయాల్సి రావడం వారిపై అదనపు భారాన్ని మోపడమే అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ప్రస్తుత 6వ తరగతి విద్యార్థులకు ఈ మూడో భాష బోర్డు పరీక్ష నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. అంతేకాకుండా, ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా అనే విషయాన్ని కూడా పునరాలోచించాలని స్పష్టం చేసింది. పాఠశాలల్లో సరిపడా అర్హత కలిగిన ఉపాధ్యాయుల లభ్యత, పాఠ్యపుస్తకాలు, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థులు ఇన్నాళ్లుగా చదువుతున్న విదేశీ భాషల కాంబినేషన్ దెబ్బతినకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది.

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్

ముంబై: వరుస నష్టాలతో సాగిన దేశీయ స్టాక్ మార్కెట్లకు ఎట్టకేలకు ఊరట లభించింది. రియల్టీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఐటీ షేర్లలో కొనుగోళ్లతో గురువారం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 628.04 పాయింట్లు లాభపడి 77,537.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.55 పాయింట్లు పెరిగి 24,231.85 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ఎటర్నల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ సూచీ దాదాపు 2 శాతం పెరిగింది. ప్రైవేట్ బ్యాంకింగ్, ఐటీ షేర్లలోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఇటీవలి మార్కెట్ పతనంతో తక్కువ స్థాయికి చేరిన షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడిందని నిపుణులు తెలిపారు. రానున్న సెషన్‌లో నిఫ్టీకి 24,100–24,000 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని నిపుణులు అంచనా వేశారు. 24,300, 24,575 వద్ద నిరోధాలు ఎదురుకావచ్చని పేర్కొన్నారు. 24,000 స్థాయిని నిలబెట్టుకుంటే కోలుకునే అవకాశాలు కొనసాగుతాయని, దాని కిందకు పడిపోతే మళ్లీ అమ్మకాల ఒత్తిడి పెరగొచ్చని సూచించారు.

## మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు

### అమెరికా కమిషన్ సంచలన వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఆర్ఎస్ఎస్‌పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛల కమిషన్ (యూఎస్సీఐఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 29న న్యూయార్క్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భగవత్‌తో పాటు ఆర్ఎస్ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నత స్థాయి దౌత్య మర్యాదలు ఇవ్వొద్దని కమిషన్ సభ్యులు కోరారు. ఆర్ఎస్ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థలు భారత్‌లో మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయని యూఎస్సీఐఆర్ఎఫ్ ఛైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఆర్ఎస్ఎస్ సభ్యుడేనని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలపై ఆంక్షలు విధించాలని కమిషనర్ జీన్ మిల్స్ సూచించారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులైన ఆర్ఎస్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో విడుదల చేసిన వార్షిక నివేదికలోనూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన యూఎస్సీఐఆర్ఎఫ్.. ఆర్ఎస్ఎస్, రా వంటి సంస్థలపై ఆంక్షలు విధించాలని సిఫార్సు చేసింది. అయితే యూఎస్సీఐఆర్ఎఫ్ ఆరోపణలను భారత్ గతంలోనే ఖండించింది. భారత్‌పై వక్రీకరించిన, ఏకపక్ష చిత్రాన్ని ఆ సంస్థ చూపుతోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అనుమానాస్పద వర్గాలు, భావజాల కథనాల ఆధారంగా యూఎస్సీఐఆర్ఎఫ్ నివేదికలు తయారవుతున్నాయని విమర్శించింది. భారత బహుళత్వ సమాజంపై తప్పుడు ముద్ర వేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు.

## అర్హులైన ఓటరు నష్టపోకుండా చూడాలి

### కాంగ్రెస్ బూత్ ఏజెంట్లకు ఎమ్మెల్యే సత్యం సూచన



గంగాధర, ఆగస్టు 20 (ఈవార్తలు): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) రెండో విడత ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. గంగాధర మండలం మధురానగర్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లకు నిర్వహించిన ఎస్ఐఆర్ రెండో విడత శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా స్థానికంగా లేని వారు, మరణించిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగినవారిని గుర్తించినట్లు తెలిపారు. అదే సమయంలో అర్హత ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేరు లేని వారిని గుర్తించి, వారికి ఓటు హక్కు కల్పించేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలకు వాస్తవాలతో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ ఎస్ఐఆర్ సమన్వయకర్త వెంకటరమణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, నాలుగు మండలాల అధ్యక్షులు, జవ్వాజి హరీష్, మంత్రి మహేందర్, కొమనబోయిన సునీల్‌యాదవ్, సింగిల్ విండో ఛైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, కోల రమేష్, సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోయిని ఎల్లేష్, సిరిసిల్ల జిల్లా బీసీ సెల్ నాయకుడు కూస రవీందర్, బీఎల్ఓ ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పౌరసత్వం ఇచ్చే అధికారాలు కలెక్టర్లకు!

### కేంద్ర హోం శాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర (గిరిజన ప్రాంతాలు మినహా) రాష్ట్రాలతో పాటు జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాల్లోని జిల్లా కలెక్టర్లకు కేంద్ర హోం శాఖ కీలకమైన అధికారాలను కట్టబెట్టింది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), 2019 కింద పౌరసత్వ దరఖాస్తులను పరిశీలించి, మంజూరు చేసే అధికారాలను సాధికార కమిటీల నుంచి ఈ ప్రాంతాల కలెక్టర్లకు బదిలీ చేసింది. ఈ మేరకు 'పౌరసత్వ (మూడో సవరణ) నిబంధనలు 2026'ను ప్రభుత్వం నోటిఫై చేసింది. కొత్త నిబంధనల ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తుదారుడు పౌరసత్వానికి తగిన వ్యక్తి అని సంతృప్తి చెందితే కలెక్టర్ నేరుగా భారత పౌరసత్వాన్ని మంజూరు చేయవచ్చు. ఇప్పటి వరకు వివిధ కమిటీల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ తక్షణమే సంబంధిత కలెక్టర్లకు బదిలీ అవుతాయి. దరఖాస్తు సమర్పించిన వెంటనే సిస్టమ్ ద్వారా ఆటోమేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ జనరేట్ అవుతుంది. ఆ తర్వాత అన్ని పత్రాలను కలెక్టర్ సరిచూసి అవసరమైన విచారణ జరుపుతారు. దరఖాస్తుదారుడి అర్హతను పరిశీలించిన అనంతరం చట్టంలో నిర్దేశించిన ప్రకారం ప్రమాణ స్వీకారం (ఓత్ ఆఫ్ అలెజియెన్స్) చేయించి పౌరసత్వ ధ్రువీకరణ పత్రం అందజేస్తారు.

## సుప్రీంకు 'తెహల్కా' డైరెక్టర్

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల కేసులో బాంబే హైకోర్టు విధించిన శిక్షను సవాల్ చేస్తూ తెహల్కా పత్రిక మాజీ ఎడిటర్ ఇన్ చీఫ్ తరుణ్ తేజ్‌పాల్ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనను దోషిగా నిర్ధారిస్తూ హైకోర్టు గోవా బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. 2013 నవంబర్‌లో గోవాలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్ లిఫ్ట్‌లో తన సహోద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై తరుణ్ తేజ్‌పాల్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో సుదీర్ఘ విచారణ అనంతరం 2021 మే నెలలో ఉత్తర గోవా సెషన్స్ కోర్టు ఆయనను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పునిచ్చింది. బాధితురాలి ప్రవర్తన, ఆమె ఇచ్చిన ఆధారాల్లో స్పష్టత లేకపోవడాన్ని ట్రయల్ కోర్టు ఎత్తిచూపింది. అయితే, ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో అప్పీల్ చేసింది. ఇటీవల ఆ అప్పీల్‌పై విచారణ జరిపిన బాంబే హైకోర్టు గోవా బెంచ్, ట్రయల్ కోర్టు తీర్పును పక్కనపెడుతూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తేజ్‌పాల్ తాజాగా సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు.

## నీట్ నిరసనల హింసపై ఉన్నత స్థాయి కమిటీ

న్యూఢిల్లీ: గత నెలలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా జరిగిన హింస, పోలీసుల చర్యలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ(హెచ్‌పీసీ)ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. ఆందోళనకారులపై హింస, లైంగిక వేధింపులపై ఈ కమిటీ పరిశీలిస్తుంది. పోలీసుల బలప్రయోగం దామాషా నిష్పత్తిలో ఉందా లేదా అనే అంశాన్ని కూడా పరిగణిస్తుంది. ఈ కమిటీలో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రవి శంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలీందర్ కౌర్, మాజీ సీబీఐ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్ఆర్ బిష్ణోయ్ సభ్యులుగా ఉన్నారు.

## లివ్ ఇన్.. పెండ్లితో సమానం: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: పరస్పర అంగీకారంతో సహజీవనం చేయడం వివాహంతో సమానమని, వారి ఎంపికలో తల్లిదండ్రులు గానీ, స్నేహితులు గానీ జోక్యం చేసుకోలేరని, లేదా వారి ప్రాణానికి ముప్పు కలిగించలేరని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. యువతి కుటుంబం నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్న ఒక సహజీవన జంటకు జస్టిస్ సౌరభ్ బెనర్జీ పోలీసు రక్షణ కల్పించారు. ఎవరి జోక్యం లేకుండా తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకుని వారితో కలిసి జీవించే పూర్తి హక్కు ఉందని న్యాయమూర్తి పేర్కొన్నారు. పరస్పర అంగీకారంతో వివాహం చేసుకొనే వయోజనుల కులం, వర్గం, రంగు, మతం లేదా విశ్వాసాలతో సంబంధం లేకుండా వారి వివాహాలు గుర్తింపునకు అర్హమైనవి. కేవలం సామాజిక నైతిక విలువలు, దురభిమానం కారణంగా రాజ్యాంగం కల్పించిన వారి ప్రాథమిక హక్కులను పరిమితం చేయడం అనేది వారి అస్తిత్వాన్ని హరించడమే అవుతుంది అని పేర్కొన్నారు.

## బీఈఎంఎల్‌లో 1346 అప్రెంటిస్ పోస్టులు

న్యూఢిల్లీ: భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ. డిఫెన్స్, ఇది ఏరోస్పేస్, మైనింగ్, కన్‌స్ట్రక్షన్ రైల్/మెట్రో వంటి కీలక రంగాలకు భారీ పరికరాలను తయారు చేస్తుంది. దీన్ని 1964లో బెంగళూరులో స్థాపించారు. ఈ సంస్థ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 1346 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనికి అర్హులైన డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 8 చివరితేదీ. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్), డిప్లొమా అప్రెంటిస్ ట్రేడ్ (ఐటీఐ), ట్రేడ్ అప్రెంటిస్ పోస్టులు ఇవి. ఈ పోస్టులను మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్/ ఇన్ఫర్మేషన్ సైన్స్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, మెషినిస్ట్, మోటార్ వెహికల్ మెకానిక్ విభాగాల్లో భర్తీ చేస్తారు. వీటికి సంబంధిత విభాగాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ, బీటెక్, డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తు చేసుకునే అభ్యర్థికి కనీసం 17 ఏండ్లు నిండి ఉండాలి. మెరిట్ ఆధారంగా ఎంపిక అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రతి ట్రేడ్, ప్రతి లొకేషన్‌కు అందుబాటులో ఉన్న సీట్లకు అనుగుణంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు పిలుస్తారు.






## రంభ ఊర్వశి మేనక
# సూపర్ కామెడీ

కామెడీ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హీరో అల్లరి నరేశ్, చాలా కాలం తర్వాత మళ్లీ తన కామెడీ జానర్‌లోకి పూర్తిస్థాయిలో వచ్చేశారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంభ ఊర్వశి మేనక'. ఈ ఫన్ ఎంటర్‌టైనర్ నుంచి చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఈ క్రమంలో సినిమా నుంచి రెండో పాట 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా'ను గురువారం విడుదల చేశారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలోని పాట వినసొంపుగా ఉండటమే కాకుండా, సినిమా కథా



నేపథ్యాన్ని తెలియజేసేలా ఉంది. ముఖ్యంగా 'వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం' వంటి చరణాలు సినిమాలోని హాస్యభరిత సన్నివేశాలపై అంచనాలను పెంచుతున్నాయి. పేదరికం, కుటుంబ సమస్యల చుట్టూ అల్లరి నరేశ్ మార్క్ కామెడీ ఏ స్థాయిలో ఉండబోతోందో ఈ పాట స్పష్టమైన హింట్ ఇస్తోందని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన అల్లరి నరేశ్, ఈ చిత్రంతో మళ్లీ ప్రేక్షకులను నవ్వించడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రంలో ఆయనకు జోడీగా కథానాయిక సురభి నటిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం కచ్చితంగా కుటుంబ ప్రేక్షకులను అలరించేలా ఉంటుందని, నరేశ్ పాత కామెడీ టైమింగ్‌ను అభిమానులు మళ్లీ చూస్తారని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, 'రంభ ఊర్వశి మేనక' చిత్రాన్ని సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



### 'ఇరుముడి' చాలా స్పెషల్

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇరుముడి'. రవితేజ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, ఈ సినిమా తనకెంత ప్రత్యేకమైనదో పంచుకున్నారు. "ప్రతి సినిమా ఒక కొత్త ప్రయాణాన్ని పరిచయం చేస్తుంది. అయితే 'ఇరుముడి' ప్రయాణం నాకు చాలా ప్రత్యేకమైనది. ఈ సినిమాను రేపు థియేటర్లలో మీరందరూ చూస్తారన్న విషయం నన్ను ఎంతో ఉత్సాహపరుస్తోంది. స్వామియే శరణం అయ్యప్ప" అని రవితేజ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

# 'ఇరుముడి' మ్యూజికల్ ట్రీట్!

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా, శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా శుక్రవారం గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతున్న వేళ, చిత్ర బృందం ప్రేక్షకులకు ఓ సంగీత కానుక అందించింది. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ సినిమా పూర్తి ఆడియో జ్యూక్‌బాక్స్‌ను గురువారం విడుదల చేశారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన పాటలకు మంచి స్పందన రాగా, ఇప్పుడు పూర్తి ఆల్బమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇందులోని కార్తీక మాసం ప్రత్యేక గీతం భక్తి, భావోద్వేగాలను ప్రతిబింబిస్తోందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తెలుగులో 'ఇరుముడి', తమిళంలో 'ఇరుముడి కట్టు' పేర్లతో ఈ చిత్రం శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, చిత్ర నాయిక ప్రియా భవాని శంకర్ సినిమాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ చిత్రంలో ఆమె కావేరి అనే భార్యగా, ఓ బిడ్డకు తల్లిగా ఎంతో ప్రేమ చూపే పాత్రలో కనిపించనున్నారు. ""ఇరుముడి' ప్రయాణం నాకు ఎంతో మధురమైనది. శివ నిర్వాణ సృష్టించిన భావోద్వేగ ప్రపంచంలో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది" అని ఆమె తెలిపారు. రవితేజతో కలిసి పనిచేయడంపై ఆమె స్పందిస్తూ.. "ఆయనతో పనిచేయడం ఓ అద్భుతమైన అనుభవం. ఆయన ఎంతో సహజంగా, స్నేహపూర్వకంగా ఉంటారు. అందుకే మా మధ్య సన్నివేశాలు చాలా సౌకర్యవంతంగా చిత్రీకరించగలిగాం" అని వివరించారు.

# సూర్య నమ్మకాన్ని నిలబెట్టాను

తమిళ అగ్ర నటుడు సూర్య, యువ దర్శకుడు వెంకీ అట్లూరి కలయికలో వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకెళుతోంది. ఆగస్టు 14న విడుదలైన ఈ కుటుంబ కథా చిత్రం, కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి మీడియాతో ముచ్చటించి సినిమా విజయం పట్ల సంతోషం వ్యక్తం చేయడంతో పాటు పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "ఈ కథ వినగానే సూర్య గారు ఎంతో ఇష్టపడ్డారు. ఆయన కొంతకాలంగా ఒక మంచి కుటుంబ కథ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, కథకు అనవసరమైన కమర్షియల్ హంగులు జోడించకుండా నిజాయతీగా తీద్దామని ఆయనే చెప్పారు. సినిమా చూశాక, తాను ఏదైతే నమ్మారో అదే తెరపై కనిపించడంతో ఆయన చాలా సంతోషపడ్డారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టగలిగాననే సంతృప్తి నాకుంది" అని తెలిపారు.





# లక్షల్లో నష్టపోయా.. ఊరెళ్లిపోతా: అంజిమామ

'మై విలేజ్ షో' నుంచి పాప్యులర్ అయిన నటుడే అంజిమామ. తనదైన యాసతో చాలా సహజంగా నటించే అంజిమామ, ఆడియన్స్ కి చాలా త్వరగా కనెక్ట్ అవుతూ ఉంటాడు. అలాంటి అంజిమామ తాజాగా 'ఐ డ్రీమ్'వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో, తన గురించిన అనేక విషయాలను ప్రస్తావించాడు." కష్టపడటం నాకు మొదటి నుంచి అలవాటే. ప్లంబర్‌గా, ఎలక్ట్రీషియన్‌గా, ఆర్ఎంపీగా పనిచేశాను. ఆ తరువాత వాటర్ ప్లాంట్ పెట్టాను. అయినా ఎక్కడా నిలదొక్కుకోలేకపోయాను" అని అన్నారు. "ఆ తరువాత స్నేహితులతో కలిసి ఈజీమని కోసం ఒక స్కీమ్ లో పెట్టుబడి పెట్టాను. దాంతో 24 లక్షల నష్టం వచ్చింది. మంచి జీవితం కోసం .. త్వరగా ఎదగాలనే కోరికతో ఈజీమని దిశగా ఆలోచన చేయడం జరిగింది. కానీ అనుభవంతో చెబుతున్నాను. ఈజీమని దిశగా ఎవరూ వెళ్లకూడదు. ఆ దిశగా ఎవరినీ ఎంకరేజ్ చేయకూడదు. ఆ ఎఫెక్ట్ కారణంగా జీవితంలో నేను మరిన్ని కష్టాలు పడవలసి వచ్చింది" అని ఆయన చెప్పారు. " ఒక వైపున నటుడిగా నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తూనే, మరో వైపున హైదరాబాద్‌లో క్యాబ్ నడుపుతున్నాను. ఎందుకంటే నెల కాగానే ఇంటికి 50 వేలు పంపించవలసి ఉంటుంది. క్యాబ్ నడిపేటప్పుడు మాస్క్ పెట్టుకున్నా నన్ను కొంతమంది గుర్తుపడుతున్నారు. ఈ కష్టాలన్నీ ఎందుకు? నా ఊరెళ్లిపోవాలని అనిపిస్తుంది. ఒక ఎకరం పొలం.. నాలుగు బర్రెలు ఉంటే హాయిగా బతకొచ్చని అనిపిస్తుంది" అంటూ ఉద్వేగానికి లోనయ్యాడు.

# టికెట్ ధరలపై ఎగ్జిబిటర్ల అభ్యంతరం

తెలంగాణలో సినిమా టికెట్ ధరల సవరణపై థియేటర్స్ యాజమాన్యం స్పందించింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై థియేటర్ల యాజమాన్యాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. సినిమా టికెట్ ధరలను ఖరారు చేస్తూ విడుదల చేసిన జీఓను ఎగ్జిబిటర్లు ఖండించారు. ఈ విషయంపై త్వరలోనే ముఖ్యమంత్రికి లేఖ రాయాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. పది రోజుల గడువు ఇచ్చి కోర్టును ఆశ్రయిస్తామని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. మరోవైపు సినిమా థియేటర్ల టికెట్ ధరలపై ప్రభుత్వం రివ్యూ చేయాలని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి చేసింది. టికెట్ ధరల నిర్ణయంపై సంబంధిత భాగస్వాములతో సంప్రదింపులు జరపాలని కోరింది. జీవో నంబర్ 77ను మరోసారి పరిశీలించాలని విన్నవించిందియ సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ థియేటర్లలో కొత్త టికెట్ ధరలపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిల్మ్ ఛాంబర్ లేఖ రాసింది. ఈ విషయంలో ఎగ్జిబిటర్లు, నిర్మాతల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని కోరింది. సింగిల్ స్క్రీన్ థియేటర్ల సమస్యలను పరిశీలించాలని.. కొత్త విధానంతో టౌన్ థియేటర్లపై ప్రభావం ఉండొచ్చని ఫిల్మ్ ఛాంబర్ ఫిల్మ్ ఛాంబర్ అభిప్రాయ వ్యక్తం చేసింది. సినిమా ప్రతినిధులతో కన్సల్టేటివ్ కమిటీ ఏర్పాటు చేయాలని అభ్యర్థించింది.







# శర్వానంద్ 'భోగి' విడుదల వాయిదా

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వాస్తవానికి ఆగస్టు 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా చిత్ర యూనిట్ నుంచి వెలువడిన సమాచారం ప్రకారం ఈ సినిమా అనుకున్న సమయానికి ప్రేక్షకుల ముందుకు రావడం లేదు. వీఎఫ్ఎక్స్ పనులకు మరింత సమయం పడుతుండటంతో ఈ సినిమా విడుదలను వాయిదా వేసినట్లు తెలుస్తుంది. సినిమాలోని విజువల్ స్కేల్, పీరియడ్ వరల్డ్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లను ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమంగా తీర్చిదిద్దే ఉద్దేశంతోనే ఈ వాయిదా వేసినట్లు తెలిపారు. వీఎఫ్ఎక్స్ పనులు పూర్తిగా పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను త్వరలోనే ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు.

# బాలీవుడ్‌కు భాగ్యశ్రీ

దక్షిణాది చిత్ర పరిశ్రమలో తనదైన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి భాగ్యశ్రీ భోర్సే బాలీవుడ్‌లో జాక్‌పాట్ కొట్టారు. 'ఆషికీ 2' ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్ సరసన ఆమె కథానాయకిగా నటించేందుకు రంగం సిద్ధమైంది. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు మిలప్ జవేరి తెరకెక్కించనున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ టి-సిరీస్ పతాకంపై ప్రముఖ నిర్మాత భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. గత నెలలో అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం, పూర్తి స్థాయి ఇంటెన్స్, వయొలెంట్ అండ్ మ్యూజికల్ లవ్ స్టోరీగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మిలప్ జవేరి తనదైన శైలిలో హై-పిచ్ రొమాంటిక్ డ్రామాగా ఈ సినిమాను మలచనున్నారు. ఈ చిత్రంలో కథానాయకిగా భాగ్యశ్రీ భోర్సేను ఖరారు చేశారని, త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమై 2027లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.



# పీవీ సింధు ఓటమి



ఢిల్లీ వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్-2026లో భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో చైనాకు చెందిన వాంగ్ జీ యీ చేతిలో 11-21, 21-15, 17-21తో సింధు ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో వాంగ్ జీ యీ తీవ్ర గాయంతో బాధపడుతున్నప్పటికీ అద్భుత ప్రదర్శన కనబరిచింది. తొలి గేమ్‌ను 11-21తో సింధు కోల్పోయింది. కానీ రెండో గేమ్‌లో తిరిగి పుంజుకున్న సింధు.. 21-15తో గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. అయితే మూడో గేమ్‌ను 21-17తో కైవసం చేసుకోవడంతో సింధు కథ ముగిసింది. మరోవైపు ఆయుష్ శెట్టి కూడా పురుషుల సింగిల్స్ రౌండ్-16 మ్యాచ్‌లో ఇండోనేషియా షట్లర్ అల్వీ ఫర్హాన్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

## కొలంబో టెస్టులో కుల్‌దీప్ కష్టమే!



**భారత సీనియర్ స్పిన్నర్, చైనామన్ కుల్‌దీప్ యాదవ్ టెస్టు కెరీర్‌కు ఎదురుదెబ్బ తగిలేలా ఉంది. శ్రీలంకతో తొలి టెస్టులో పూర్తిగా విఫలమైన అతడిని పక్కానబెట్టాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.**

ఆదివారం నుంచి కొలంబోలో జరిగే రెండో టెస్టులో అతని స్థానంలో యువ స్పిన్నర్ సారాంశ్ జైన్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని చూస్తోంది. గాలె మైదానంలో ఐదో రోజు పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామంలా మారిన వేళ.. తన మణికట్టు మాయాజాలంతో కుల్‌దీప్ ప్రత్యర్థి బ్యాటర్లను వణికిస్తాడని చేస్తాడని అంతా భావించారు.

రెండో ఇన్నింగ్స్‌లో అతను 11 ఓవర్లు వేసి ఒక్క వికెట్ కూడా తీయకుండా 38 పరుగులు ఇచ్చి తీవ్రంగా నిరాశపరిచాడు. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా జడేజా, మానవ్ సుతార్‌లపైనే ఎక్కువ నమ్మకం ఉంచగా, ఆ ఇద్దరూ కలిసి 14 వికెట్లతో భారత్ ఘనవిజయానికి బాటలు పరిచారు. ఈ నేపథ్యంలో రెండో టెస్టులో కుల్‌దీప్ స్థానం ప్రశ్నార్థకంగా మారింది. గాలె టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 31 ఏండ్ల కుల్‌దీప్ సాధించింది కేవలం ఒక్క వికెట్ మాత్రమే. అది కూడా తొలి ఇన్నింగ్స్‌లో కమిందు మెండిస్ ఇచ్చిన క్యాచ్‌ను శుభ్‌మన్ గిల్ అద్భుతంగా పట్టుకోవడంతో దక్కింది. పిచ్ నుంచి గ్రిప్, బౌన్స్ రాబట్టేందుకు కుల్‌దీప్ రౌండ్ ది వికెట్ నుంచి బౌలింగ్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఎల్బీ అవకాశాలను రాబట్టలేకపోయాడు. ఇక, శ్రీలంక టాపార్డర్‌లో ఎక్కువ మంది లెఫ్టాండ్ బ్యాటర్లు ఉన్నారు. వాళ్లను కట్టడి చేయడానికి ఆఫ్ స్పిన్నర్ సరైన ఆయుధం కాబట్టి, కుల్‌దీప్ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్ సారాంశ్ జైన్‌ను బరిలోకి దించాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. సారాంశ్ జట్టులోకి వస్తే లంక బ్యాటింగ్ ఆర్డర్‌పై ఒత్తిడి పెంచవచ్చని భావిస్తోంది. ఆడిన తొలి రెండు టెస్టుల్లోనే మానవ్ సుతార్ అద్భుత ప్రదర్శన చేయగా.. ఇప్పుడు కొలంబో టెస్టులో కొత్త ఆటగాడు సారాంశ్‌ను తుది జట్టులోకి తీసుకుంటే అది కుల్‌దీప్ టెస్ట్ కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపే చాన్సుంది.



## కొలంబో టెస్టుకు సరాన్ష్ జైన్?

గాలే టెస్టులో భారీ విజయంతో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశల్నీ సజీవంగా ఉంచుకున్న భారత జట్టు.. సిరీస్‌పై కన్నేసింది. స్పిన్ అస్త్రంతో దెబ్బతీయానుకున్న శ్రీలంకను చిత్తుగా ఓడించిన టీమిండియా కొలంబోలోనూ చెలరేగాలని భావిస్తోంది. అరంగేట్రం మ్యాచ్‌లోనే మానవ్ సుతార్ 10 వికెట్లతో ఆకట్టుకోగా.. రెండో టెస్టులో ప్రయోగాలకు సిద్ధమవుతోంది భారత్. ఈసారి స్క్వాడ్‌లోని మరో ఆల్‌రౌండర్ డెబ్యూట్ క్యాప్ అందుకుంటాడని సమాచారం. శ్రీలంక పర్యటనను విజయంతో ఆరంభించిన భారత జట్టు రెండో టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. దేవ్‌దత్ పడిక్కల్ శతకమోత, ఆపై మానవ్ సుతార్ తిప్పేయడంతో అలవోకగా గెలుపొందిన టీమిండియా.. కొలంబోలో మరో స్పిన్ అస్త్రాన్ని ఉపయోగించనుంది. ఎడమ చేతివాటం స్పిన్నరైన 33 ఏళ్ల సరాన్ష్ జైన్(ఝఖీఝఅంష్ట్ర జీఖఱఅ) ఈ మ్యాచ్‌తో టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి. దేశవాళీలో మధ్యప్రదేశ్ తరఫున అద్భుతంగా రాణించిన జైన్ గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో స్క్వాడ్‌లోకి వచ్చాడు. ప్రతిభావంతుడైన అతడికీ అవకాశం ఇవ్వాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. జైన్‌ను ఆడించాలనుకుంటే తుది జట్టు నుంచి కుల్దీప్ యాదవ్‌ను తప్పించాల్సి వస్తుంది. గాలే టెస్టులో ఈ చైనామన్ బౌలర్ 25 ఓవర్లలో 103 పరుగులిచ్చి ఒకటే వికెట్ తీశాడు. దాంతో.. కుల్దీప్‌ను పక్కనపెట్టడం దాదాపు ఖాయం అనిపిస్తోంది. ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగనుంది.

## ప్రజ్ఞానంద రన్నరప్

ప్రతిష్టాత్మక సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు. గురువారం అమెరికాకు చెందిన వెస్లీ సోతో జరిగిన ఉత్కంఠభరిత అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు. దీంతో కొద్దిలో టైటిల్ విజయం చేజార్చుకుని రెండో స్థానంతో టోర్నీని ముగించాడు. అంతకుముందు చివరి,9వ క్లాసికల్ రౌండ్‌లో నెదర్లాండ్స్ గ్రాండ్‌మాస్టర్ అనీష్ గిరితో జరిగిన మ్యాచ్‌ను ప్రజ్ఞా డ్రాగా ముగించాడు. చెరో 5.5 పాయింట్లతో వెస్లీ సో, ప్రజ్ఞా సమంగా నిలవడంతో విన్నర్‌ను తేల్చేందుకు టైబ్రేక్ అనివార్యమైంది. ఇందులో రెండు ర్యాపిడ్ గేమ్స్‌లో చెరోటి నెగ్గడంతో అర్మగెడాన్ ను నిర్వహించగా.. చివరకు వెస్లీనే పైచేయి సాధించాడు.



## డైమండ్ లీగ్ ఫైనల్ బెర్తుపై నీరజ్ గురి

కామన్వెల్త్ గేమ్స్ తర్వాత భారత్ స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా, శ్రీలంక సంచలనం రుమేష్ పతిరాగే శుక్రవారం జరగనున్న లాసాన్ డైమండ్ లీగ్ మీట్‌లో మరోసారి ముఖాముఖి తలపడనున్నారు. గ్లాస్గో గేమ్స్‌లో పతిరాగే 89.75 మీటర్ల త్రోతో స్వర్ణం సాధించగా, నీరజ్ 85.83 మీటరతో రజతం గెలిచాడు. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న 23 ఏండ్ల పతిరాగే రోమ్ డైమండ లీగ్‌లో 92.62 మీటర్ల అత్యుత్తమ త్రోతో రాణించడంతో పాటు దోహా, రోమ్ మీట్‌లలో స్వర్ణాలు గెలిచాడు. మరోవైపు గత ఏడాది సెప్టెంబర్ నుంచి గాయంతో బాధపడుతున్న 28 ఏండ్ల నీరజ్ తిరిగి తన పాత ఫామ్ అందుకోవడానికి శ్రమిస్తున్నాడు. సెప్టెంబర్ 4, 5న బ్రస్సెల్స్‌లో జరిగే డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించడమే లక్ష్యంగా నీరజ్ ఈ టోర్నీలోకి దిగుతున్నాడు.





## భారత్‌కు డ్రా

### సెకండ్ రౌండ్‌కు అర్హత

హాకీ మహిళల ప్రపంచకప్-2026లో ఇంగ్లండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. దీంతో భారత అమ్మాయిల జట్టు పూల్-డిలో కీలక పాయింట్ సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లు ఒక్క గోల్ కూడా సాధించకపోవడంతో మ్యాచ్ డ్రా ముగిసింది. తొలి క్వార్టర్‌లో భారత జట్టు అద్భుతమైన ఆటతీరు కనబరిచింది. పెనాల్టీ కార్నర్‌లో నవ్‌నీత్ కౌర్ బంతిని నెట్‌లోకి పంపినప్పటికీ, అది భారత ప్లేయర్ శరీరానికి తగలడంతో గోల్‌ను అనుమతించలేదు. మరోవైపు ఇంగ్లండ్‌కు వరుస పెనాల్టీ కార్నర్లు లభించాయి. అయితే భారత గోల్‌కీపర్ సవితా పునియా, డిఫెండర్ సలీమా టెటే అద్భుతమైన డిఫెన్స్‌తో ఇంగ్లండ్‌కు గోల్ సాధించే అవకాశాలు ఇవ్వలేదు. కాగా పూల్ డి నుంచి చైనా, భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా.. ఇంగ్లండ్, సౌతాఫ్రికా జట్లు ఇంటి ముఖం పట్టాయి.

## సచిన్ కంటే కోహ్లి బెటర్: డివిలియర్స్



టీమిండియా బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. అంతర్జాతీయ క్రికెట్‌లో వంద సెంచరీలు సాధించిన ఏకైక ఆటగాడు. అంతేకాదు.. అత్యధిక పరుగుల వీరుడిగానూ సచిన్ కొనసాగుతున్నాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 34,357 పరుగులు సాధించాడు. ఇక టెస్టుల్లో రికార్డు స్థాయిలో 51 శతకాల సాయంతో ఏకంగా 15,921 పరుగులు సాధించాడు సచిన్. మరోవైపు.. విరాట్ కోహ్లి సైతం ప్రపంచ క్రికెట్‌పై తనదైన ముద్ర వేశాడు. వన్డేల్లో 54సార్లు శతక్కొట్టి.. సచిన్ వన్డే సెంచరీ (49)ల రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించాడు. కాగా సచిన్-కోహ్లి మధ్య పోలిక గురించి ఇప్పటికే పలువురు మాజీ క్రికెటర్లు తమ అభిప్రాయాలు పంచుకున్న సంగతి తెలిసిందే. వీరిద్దరు ఎవరికి వారే ప్రత్యేకమని.. ఇద్దరినీ పోల్చి చూడటం సరికాదనేదే చాలా మంది అభిప్రాయం. అయితే, సౌతాఫ్రికా దిగ్గజ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ తాజాగా సచిన్- కోహ్లి గురించి చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ చర్చకు దారితీశాయి. ఉపఖండ బ్యాటర్లకు విదేశాల్లో టెస్టు క్రికెట్ ఎలా ఆడాలో సచిన్ చూపించాడన్న ఏబీడీ.. కోహ్లి మాత్రం సచిన్‌నే అధిగమించిపోయాడని అన్నాడు. తన యూట్యూబ్ చానెల్ వేదికగా మాట్లాడుతూ.. "బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై ఎలా ఆడాలో ఉపఖండ బ్యాటర్లకు సచిన్ టెండుల్కర్ దిశానిర్దేశం చేశాడు. అయితే, విరాట్ ఆ వారసత్వాన్ని మరింత గొప్పగా ముందుకు తీసుకువెళ్లాడు. నిజానికి ఈ ట్రెండ్‌ను మొదలుపెట్టింది సచిన్ అయినా.. ఆయన విరాట్ కోహ్లి అంత స్ట్రాంగ్ అయితే కాదు. సచిన్ కంటే కోహ్లి బెటర్. కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్ వంటి బ్యాటర్లు విరాట్,

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 21-8-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# పెండ్లి పిల్లకు కష్టకాలం

తెలంగాణలో పేదింటి ఆడబిడ్డ పెళ్లి అంటే ఒక కుటుంబానికి పండుగ కంటే ముందుగా ఒక పెద్ద ఆర్థిక పరీక్ష. కూలి చేసుకునే తల్లిదండ్రులు, చిన్నచిన్న పనులతో జీవించే కుటుంబాలు, అప్పుల మీద ఆధారపడే మధ్యతరగతి పేదలు.. కూతురి పెళ్లి ఖర్చు ఎలా భరించాలన్న ఆందోళనలో ఉంటారు. అలాంటి కుటుంబాలకు కొంత ఆర్థిక ఊరటగా నిలిచిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం ఇప్పుడు వేలాది కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోంది. కేవలం పథకం నిలిచిపోయిందనే బాధ కాదు ఇది. ఇప్పటికే పెళ్లి నిశ్చయించుకున్న కుటుంబాలు, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, పెళ్లి తేదీలు దగ్గరపడుతున్న పేద తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటన్నదే అసలు ప్రశ్న. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల చట్టబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఆగస్టు 12న మధ్యంతర స్టే విధించింది. తదుపరి విచారణ వరకు ఈ పథకాల కింద చెల్లింపులు చేయవద్దని ఆదేశించింది. ఆ తర్వాత ఆగస్టు 20న కూడా స్టేను ఎత్తివేయలేదు. కేసు సెప్టెంబర్ 9కు వాయిదా పడింది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన అంశం ఒకటుంది. కోర్టు పేదలకు వ్యతిరేకం కాదు; పథకం చట్టబద్ధతపైనే ప్రశ్నలు లేవనెత్తింది. ఈ తేడాను రాజకీయ ప్రచారానికి, ప్రజల్లో అపోహలకు వాడుకోవడం సరికాదు. పిటిషన్‌లో ప్రధానంగా ఈ పథకాలు చట్టసభ ఆమోదించిన చట్టం ఆధారంగా కాకుండా ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అమలు కావడాన్ని సవాలు చేశారు. అయితే అదే సమయంలో ప్రభుత్వాన్ని అడగాల్సిన ప్రశ్నలు కూడా చాలా ఉన్నాయి. ఇన్నేళ్లుగా అమలు చేస్తున్న పథకానికి చట్టపరమైన పునాది ఎందుకు పటిష్టం చేయలేదు? వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో కొనసాగుతున్న పథకానికి శాసనపరమైన రక్షణ కల్పించడంలో ఎందుకు జాప్యం జరిగింది? కోర్టు ముందు ప్రభుత్వం తన వాదనను సమర్థంగా వినిపించడానికి అవసరమైన కౌంటర్ అఫిడవిట్‌ను సమయానికి ఎందుకు దాఖలు చేయలేకపోయింది? ఇది కేవలం ఒక ప్రభుత్వ శాఖ వైఫల్యం కాదు. ఒక సంక్షేమ పథకం ప్రారంభించిన రోజు నుంచి దాని భవిష్యత్తు, చట్టబద్ధత, నిధుల కేటాయింపు, అమలు విధానం వంటి అంశాలను ప్రభుత్వం నిరంతరం సమీక్షించాలి. పథకం రాజకీయంగా ప్రజాదరణ పొందినంత మాత్రాన అది పరిపాలనా పరంగా పూర్తి అయినట్లుకాదు. ప్రస్తుతం అసలు ఇబ్బంది పడేది ఎవరు? చట్టపరమైన వివాదంలో ఉన్న ప్రభుత్వం కాదు. కోర్టులో వాదిస్తున్న న్యాయవాది కాదు. నిర్ణయాలు తీసుకునే అధికారులు కూడా కాదు. కూతురి పెళ్లి కోసం అప్పు తెచ్చి, ప్రభుత్వ సహాయం వస్తుందని ఆశించిన పేద తండ్రి. పెళ్లి ఖర్చు కోసం ఆభరణాలు తాకట్టు పెట్టిన తల్లి. దరఖాస్తు చేసి డబ్బు కోసం ఎదురు చూస్తున్న యువతి. వీరికి రాజ్యాంగంలోని ఆర్టికల్ ఏది, జీవో ఏది, చట్టబద్ధత ఏంటి అనే విషయాల కంటే.. తమకు రావాల్సిన సహాయం ఎప్పుడు వస్తుందన్నదే ముఖ్యం. అందుకే ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని న్యాయపరమైన సమస్యగా మాత్రమే చూడకూడదు. ఇది సామాజిక బాధ్యతగా చూడాలి. హైకోర్టు ప్రశ్నించిన చట్టబద్ధత అంశానికి ప్రభుత్వం సమగ్ర సమాధానం ఇవ్వాలి. అవసరమైతే శాసనపరమైన మార్గాన్ని అనుసరించి పథకానికి స్పష్టమైన చట్టబద్ధ పునాది కల్పించాలి. ప్రజాధన వినియోగంపై కోర్టు లేవనెత్తిన సందేహాలకు పూర్తి వివరాలతో సమాధానం ఇవ్వాలి. ఆర్థిక భారం ఎంత? ఎంతమంది లబ్ధిదారులు? ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? ఇప్పటికే మంజూరైన మొత్తాల పరిస్థితి ఏమిటి? భవిష్యత్తులో పథకాన్ని ఎలా కొనసాగించబోతున్నారు?.. ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. అదే సమయంలో పేద కుటుంబాలను రాజకీయ నినాదాల మధ్య నలిపివేయకూడదు. సంక్షేమ పథకాలు ఓట్ల కోసం ఇచ్చే వరాలు కావు. అవి సామాజిక అసమానతలను కొంతైనా తగ్గించే ప్రభుత్వ బాధ్యతలో భాగం. అయితే సంక్షేమం పేరుతో ప్రజాధనాన్ని ఖర్చు చేయాలంటే చట్టబద్ధత, పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ కూడా అంతే అవసరం. చట్టబద్ధత లేకుండా సంక్షేమం నిలబడదు; సంక్షేమం లేకుండా సామాజిక న్యాయం నిలవదు. కాబట్టి పరిష్కారం కోర్టును తప్పుపట్టడంలో లేదు. ప్రభుత్వం తన తప్పులను సరిదిద్దుకోవడంలో ఉంది. హైకోర్టు స్టే ఎత్తివేస్తుందా? పథకాలకు చట్టబద్ధత ఉందని తేలుతుందా? ప్రభుత్వం కొత్త చట్టపరమైన మార్గాన్ని ఎంచుకుంటుందా?.. ఇవన్నీ న్యాయ ప్రక్రియలో తేలాల్సిన అంశాలు. అయితే, పేదింటి ఆడబిడ్డ పెళ్లి రాజకీయ పోరాటానికి బలి కాకూడదు. కూతురి పెళ్లి కోసం ప్రభుత్వ సహాయాన్ని ఆశించిన కుటుంబానికి కోర్టు తీర్పు వచ్చే వరకు అనిశ్చితి మిగలకూడదు. న్యాయస్థానాన్ని గౌరవిస్తూనే, ప్రభుత్వం తన పరిపాలనా బాధ్యతను కూడా నిర్వర్తించాలి. అవసరమైతే ప్రత్యామ్నాయ న్యాయపరమైన, బడ్జెట్ మార్గాలను అన్వేషించాలి. కళ్యాణలక్ష్మి నిజంగా పేదింటి ఆడబిడ్డకు "కల్యాణ లక్ష్మి" కావాలంటే, అది కేవలం ఒక జీవోపై ఆధారపడే పథకంగా కాకుండా చట్టబద్ధమైన, పారదర్శకమైన, నిరంతరమైన సామాజిక భరోసాగా మారాలి. అప్పుడే పెండ్లి పిల్ల తల్లిదండ్రుల కళ్లలో మళ్లీ నమ్మకం కనిపిస్తుంది.



## జీవిత 'పాఠాలు' నేర్పరేమి?

ఒక ఉపాధ్యాయురాలి హత్య మన ముందుంచిన ప్రశ్న.. మన పిల్లలను మనం అర్థం చేసుకుంటున్నామా? పాఠశాల అంటే పుస్తకాలు. పాఠశాల అంటే అక్షరాలు. పాఠశాల అంటే పిల్లల కలలు. అక్కడి నుంచి పిల్లలు మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలి. కానీ అదే పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులే ఒక ఉపాధ్యాయురాలిని దారుణంగా హత్య చేశారనే వార్త మనల్ని ఒక్కసారి ఆగి ఆలోచించేలా చేస్తోంది. ఈ నెల 11న నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యకు గురైన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఆమెపై కత్తితో దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఘటనపై జరిగిన దర్యాప్తులో విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు వార్తలు వెలువడటం మరింత ఆందోళన కలిగించింది. ఇక్కడ మనం నిందలు వేయడానికి ముందు ఒక ప్రశ్న వేసుకోవాలి.. ఇంత చిన్న వయసులో ఒక మనిషిని చంపాలనే ఆలోచన ఎలా వస్తుంది? ఇది సులభమైన ప్రశ్న కాదు. కానీ ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన బాధ్యత మనందరిదీ. ఎందుకంటే ఇది కేవలం ఒక నేర ఘటనగా చూసి ముగించాల్సిన విషయం కాదు. పిల్లల ఆలోచనా విధానం, కుటుంబ వాతావరణం, పాఠశాల సంస్కృతి, సమాజ ప్రభావం.. ఇవన్నీ మనం పరిశీలించాల్సిన అవసరం ఉంది. పిల్లలకు చదువు మాత్రమే సరిపోతుందా? మన పిల్లలు మంచి మార్కులు తెచ్చుకోవాలి. మంచి ఉద్యోగం సంపాదించాలి. జీవితంలో ఎదగాలి. అందుకోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారు. కానీ పిల్లలకు మరో విషయం కూడా నేర్పుతున్నామా? కోపం వచ్చినప్పుడు ఏం చేయాలి? ఎవరైనా మన మాట వినకపోతే ఎలా స్పందించాలి? ఓడిపోయినప్పుడు ఎలా నిలబడాలి? మనకు నచ్చని మాట ఎవరైనా చెప్పినప్పుడు ఎలా తీసుకోవాలి? తప్పు జరిగితే ఎలా అంగీకరించాలి? కోపంతో తీసుకున్న నిర్ణయం ఎంత ప్రమాదకరమో వారికి చెబుతున్నామా? పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవడం ముఖ్యం. కానీ జీవితంలో మంచి మనిషిగా నిలబడటం అంతకంటే ముఖ్యం. అందుకే అసలు ప్రశ్న.. చదువు నేర్పుతున్నామా?లేక జీవితాన్ని నేర్పుతున్నామా? ఒక పిల్లవాడు పరీక్షలో తక్కువ మార్కులు తెచ్చుకుంటే తల్లిదండ్రులు వెంటనే అడుగుతారు.. "ఎందుకు తక్కువ మార్కులు వచ్చాయి?" కానీ అదే పిల్లవాడు కొన్ని రోజులుగా మౌనంగా ఉంటే? ఎప్పుడూ కోపంగా ఉంటే? చిన్న విషయానికే గొడవ పడితే? ఎవరితోనూ మాట్లాడకుండా ఉంటే? అతని ప్రవర్తన ఒక్కసారిగా మారితే? అప్పుడు మనం అడుగుతున్నామా.. "ఏమైంది నాన్నా?" "ఏమైంది అమ్మా?" పిల్లలకు మార్కులు ఎంత ముఖ్యమో, వారి మనసు కూడా అంతే ముఖ్యం. అందుకే పిల్లల రిపోర్ట్ కార్డు మాత్రమే కాదు.. వారి బిహేవియర్ కార్డు కూడా గమనించాలి. ఇప్పటి పిల్లల ప్రపంచం పాఠశాలతో మాత్రమే ఆగిపోవడం లేదు. వారి చేతిలో మొబైల్ ఉంది. సోషల్ మీడియా ఉంది. ఎన్నో రకాల వీడియోలు ఉన్నాయి. కొత్త స్నేహాలు ఉన్నాయి. మనకు తెలియని ఆన్‌లైన్ ప్రపంచం ఉంది. ఇవన్నీ పిల్లలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే ప్రతి సమస్యకు మొబైల్ కారణమని చెప్పలేం. ప్రతి పిల్లవాడిని అనుమానించడం కూడా సరైంది కాదు. కానీ తల్లిదండ్రులు పిల్లలతో మాట్లాడాలి. వాళ్లు ఏం చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? వారి మనసులో ఏం జరుగుతోంది? అన్నది తెలుసుకోవాలి. వారికి పర్యవేక్షణతో పాటు ప్రేమ కూడా అవసరం. పిల్లలు తప్పు చేస్తే ఉపాధ్యాయులు చెప్పాలి. క్రమశిక్షణ నేర్పాలి. మంచి మార్గంలో నడిపించాలి. కానీ ఒక ఉపాధ్యాయుడు.. "విద్యార్థిని మందలిస్తే ఏదైనా సమస్య వస్తుందేమో" అని భయపడే పరిస్థితి వస్తే అది చాలా ప్రమాదకరం. అయితే పరిష్కారం పిల్లలను భయపెట్టడం కాదు. క్రమశిక్షణ అవసరం. నియమాలు అవసరం. అదే సమయంలో పిల్లల మనసును అర్థం చేసుకోవడం కూడా అవసరం. పిల్లలకు అన్నీ ఇవ్వడం మాత్రమే తల్లిదండ్రుల బాధ్యత కాదు. వారితో మాట్లాడటం కూడా బాధ్యతే. రోజుకు కొంత సమయం పిల్లల కోసం కేటాయించాలి. "స్కూల్ ఎలా ఉంది?" అని మాత్రమే కాకుండా.. "ఈరోజు ఏం జరిగింది?", "ఎవరితో మాట్లాడావు?", "ఏదైనా బాధగా ఉందా?", "ఎవరైనా నిన్ను ఇబ్బంది పెడుతున్నారా?" అని అడగాలి. పిల్లలకు సమస్య వచ్చినప్పుడు ముందుగా తల్లిదండ్రుల దగ్గరకు రావాలనే నమ్మకం కల్పించాలి. భయపడే తల్లిదండ్రులు కాదు.. నమ్మగలిగే తల్లిదండ్రులు కావాలి.



మహేశ్ గౌడ్, రిసెర్చ్ స్కాలర్
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్,
ఉస్మానియా యూనివర్సిటీ

# అమ్మ.. అడవి.. బిడ్డ!

కొన్ని కథలు చరిత్ర పుస్తకాల్లో నల్లటి అక్షరాలై ఉండిపోతాయి. కొన్ని కథలు మేధావుల సభల్లో వేడివేడి రాజకీయ చర్చలకు పరిమితమవుతాయి. కానీ మరికొన్ని కథలు మాత్రం... సమాజపు కఠినమైన పొరలను చీల్చుకుంటూ వచ్చి, మనిషి గుండెను నిశ్శబ్దంగా ముక్కలు చేస్తాయి. ఇది కేవలం ఒక మాజీ మావోయిస్టు కథ మాత్రమే కాదు. ఒక కన్నకూతురి కథ. ఒక కడగండ్ల తల్లి కథ. రక్తమోడిన అడవి కథ. రగిలిన యుద్ధపు కథ. చివరికి... "నాకూ మా అమ్మ ఉంది" అని కన్నీళ్ల తుంపరల నడుమ గర్వంగా, ఆరాటంగా చెప్పుకున్న ఒక సజీవ మానవీయ సత్యం!

ఒకప్పుడు దండకారణ్యంలో మహిళలు ఉద్యమంలో కనిపించడం అరుదు. కానీ కాలం గడిచేకొద్దీ... దశాబ్దాల కన్నీటి నది పారేసరికి, ఆ సాయుధ పోరాటంలో మహిళలే సగానికి సగానికి చేరుకున్నారు. అది కేవలం విప్లవ సిద్ధాంతాల ఆకర్షణ మాత్రమే కాదు. సమాజం వారిపై విసిరిన పీడన, పేదరికం, అవమానాలు, కట్టుబాట్ల శృంఖలాలు. "జీవించాలంటే అనుక్షణం తలవంచి బానిసగా బతకాలా? లేక హక్కుల కోసం తిరగబడాలా?" అనే నిత్య సంక్షోభం. మైదాన ప్రాంతాల్లో వరకట్న రాక్షసి బారిన పడే ఆడపిల్లల కంటే, అడవి బిడ్డలు ఎదుర్కొనే సామాజిక అణచివేత శృంఖలాలు మరీ క్రూరమైనవి. అందుకే అనేక ఆదివాసీ కుటుంబాల్లో కొడుకుల కంటే కూతుళ్లే అడవి బాట పట్టారు. వాళ్లు తుపాకీని ప్రేమించి ఆయుధం పట్టలేదు... తమ ఉనికిని, తమ జీవితంపై తమకున్న హక్కును కాపాడుకోవడానికి ఆ కష్టాల బాటను ఎంచుకున్నారు. ఆ తరం నిశ్శబ్ద రోదనకు ఆకృతి... సుగుణ. సుగుణ ఎప్పుడు పుట్టిందో ఆమెకే తెలియదు. కన్నతల్లికీ గుర్తు లేదు. ఆదివాసీల జీవితాల్లో పుట్టిన తేదీలు ఆస్పత్రి కాగితాల్లో రూపుదిద్దుకోవు. బడి ముఖం చూడని ఆ పసిపాపల ఆకారాలను చూసి, ఎప్పుడో ప్రభుత్వ అధికారులు ఇచ్చే ఆధార్ కార్డుల్లో గంపగుత్తగా "జనవరి 1" అని రాసేస్తారు. అదే వారికి అధికారిక జన్మదినం. పుట్టిన తేదీ లేని ఆ పిల్లలకు తుపాకీ పట్టిన రోజు మాత్రం అడవి గుండెల్లో పచ్చబొట్టులా ముద్రపడిపోయింది.

సుగుణది 'సల్వాజుడుం' మంటల్లో పెరిగిన తరం. ఆ నరమేధం కేవలం ఊళ్లను, గుడిసెలను మాత్రమే కాల్చలేదు.. కన్నపేగుల బంధాలను, కుటుంబాలను దారుణంగా మూడు ముక్కలు చేసి పారేసింది. సామూహిక హింసకు బలవుతూ, సహాయ శిబిరాల ముళ్లకంచెల మధ్య బందీలుగా మారిన అమాయకులు కొందరైతే, బతుకు జీవుడా అని సరిహద్దులు దాటి పొరుగు రాష్ట్రాలకు పారిపోయినవాళ్లు ఇంకొందరు, "ఈ అడవి మాదే... మా చర్మం ఒలిచినా ఈ నేలను వీడం" అని ఆయుధం పట్టి అడవిలోనే మిగిలిపోయిన పోరాట యోధులు మరికొందరు. సుగుణ మూడో మార్గాన్ని ఎంచుకుని అడవికి అంకితమైతే.. ఆమె తల్లి పాండే, భర్తను కోల్పోయి, ఆదుకునేవారు లేక, బతకడం కోసం సరిహద్దు దాటి రెండో మార్గాన్ని ఎంచుకుంది. ఆ ఒక్క రోజుతో... ఒకే గర్భంలో పుట్టిన బంధం, రెండు వేర్వేరు ప్రపంచాల నడుమ తెగిపడింది.

తల్లి ఎక్కడుందో కూతురికి తెలియదు. బతికే ఉందో లేక ఆ రక్తపాతంలో కలిసిపోయిందో అసలే తెలియదు. కూతురు ఎక్కడుందో తల్లికి తెలియదు. తుపాకీ తూటాలకు ఎక్కడైనా బలైపోయిందో అని రాత్రుళ్ళు కన్నీళ్లు కార్చడం తప్ప ఆమె ఏమీ చేయలేదు. లేఖలు లేవు. ఫోన్ కాల్స్ లేవు. వార్తలు చేరవేసే మనుషులు లేరు. కాలం దారుణంగా కదిలిపోతోంది. అడవిలో కూతురు గెరిల్లాగా మారుతుంటే... అక్కడ సరిహద్దుల అవతల తల్లి వృద్ధురాలై, కంటిచూపు కోల్పోతూ ఒంటరితనంతో కుమిలిపోతోంది. వారిద్దరి మధ్య... ఇరవై ఏళ్ల సుదీర్ఘమైన, భయంకరమైన నిశ్శబ్దం! వర్షాకాలంలో అడవి నరకాన్ని తలపించేది. చలికి వణుకుతూ, ప్లాస్టిక్ కవర్ కింద తలదాచుకుంటూ, తడిసిన బట్టలతో నిలబడే రాత్రులలో... సుగుణకు కన్నతల్లి ముఖమే గుర్తుకొచ్చేది. కామ్రేడ్స్ చూస్తే బలహీనురాలని అనుకుంటారేమోనని, తన కన్నీటి చుక్కలను ఆ నడిరాత్రి చీకట్లోనే అడవి నేలకు అప్పగించేది. ప్రజాబలగాల్లో పనిచేస్తూ ఏ గ్రామానికి వెళ్లినా, అక్కడి వృద్ధ మహిళలు సుగుణను కన్నబిడ్డలా చూసుకునేవారు. వారి ఆదరణలో, వారి కౌగిలిలో... సుగుణ తన కన్నతల్లి స్పర్శను వెతుక్కునేది. ఎంతోమంది 'అమ్మలు' దొరికారు... కానీ తనను నవమాసాలు మోసి కన్న "ఆ అమ్మ" మాత్రం దొరకలేదు. సుగుణకు అడవిలోనే ఒక తోడు దొరికాడు.. "మల్లియా". ఇద్దరూ ఒకే లక్ష్యం కోసం నడిచే ఉద్యమకారులు. వారు ఒక కఠినమైన, గుండెను పిండేసే నిర్ణయం తీసుకున్నారు.. పిల్లలు వద్దని. పిల్లలంటే ఇష్టం లేక కాదు. కడుపులో పసిపాప పెరుగుతుంటే అడవిలో బాంబుల నడుమ, తూటాల వర్షంలో ఒక తల్లి పడే నరకం వారికి తెలుసు. పసిపాప కేరింత లేదా ఏడుపు పోలీస్ బూట్ల శబ్దాలకు దారి చూపిస్తుందన్న కఠోర సత్యం వారికి తెలుసు. పురిటినొప్పుల మాధుర్యాన్ని, పసికందు చిరునవ్వులను ఆ ఆశయ సాధన యజ్ఞంలో దహనం చేశారు. కడుపు ఫలాన్ని కూడా అడవికే బలిచ్చిన ఆ దంపతుల గుండెల్లో ఎంతటి రగిలే వేదన ఉందో ఆ దేవుడికే తెలియాలి.

ఉద్యమంలో సుగుణ నిరంతరం తన లక్ష్య సాధన కోసమే పూర్తి అంకితభావంతో పరితపించేది. కానీ మారిన పరిస్థితులు, అడవిలో ముసురుకున్న ఆంక్షలు, తీవ్రమైన దాడుల నేపథ్యంలో ప్రజాసంబంధాలు దెబ్బతింటున్న తీరుపై విస్తృతమైన చర్చలు మొదలయ్యాయి. ఆయుధాలతో ప్రజల మధ్యకు వెళ్లడం సాధ్యం కాని ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో.. మారిన వ్యూహంలో భాగంగా, తాత్కాలికంగా ఆయుధాలు పక్కనబెట్టి విశాల ప్రజారాశుల మధ్యకు బహిరంగంగా వెళ్లాలని చర్చ మొదలైంది. సంస్థ పట్ల, విప్లవ ఆశయాల పట్ల కొండంత అంకితభావం ఉన్న సుగుణ, ఆమె సహచరుడు మల్లియా.. కొంతకాలం సాయుధ పోరుకు స్వస్తి చెప్పి ఈ సుడిగుండం నుంచి బయటపడాలని నిర్ణయం తీసుకున్నారు. మారుతున్న పరిస్థితుల ప్రభావం వల్ల వారు తమ సుదీర్ఘమైన అజ్ఞాత జీవితాన్ని వీడి, సాయుధ పోరును తాత్కాలికంగా పక్కనబెట్టి జనజీవన ప్రవంతిలో కలిశారు. ఆ విధంగా వారు పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. నాయకత్వ ఆదేశాలతో బయటకు వచ్చి పునరావాస కేంద్రంలో అడుగుపెట్టిన తర్వాత అక్కడ వాతావరణం ఎంతో భావోద్వేగంగా ఉండేది. అక్కడున్న ప్రతీ ఒక్కరినీ చూడటానికి బయటి ప్రపంచం నుంచి వాళ్ల కుటుంబాలు వచ్చేవి. తల్లులు, తండ్రులు, తోబుట్టువులు... గుండెలకు హత్తుకుని ఏడ్చేవారు. కన్నీళ్లతో తలలు నిమిరేవారు. కానీ సుగుణ మాత్రం ఓ మూలన నిలబడి, ఆ బంధాల కలయికను చూస్తూ నిశ్శబ్దంగా ఏడ్చేది. ఆమె కళ్లలో ఒకే ఒక ఆరాటం, ఒకే ఒక ప్రశ్న? "నా అమ్మ ఎక్కడుంది? నా కోసం ఏడ్చే నా అమ్మ బతికే ఉందా?" ఆ ఏకాంత రాత్రులలో ఆమె వేదన వర్ణనాతీతం. మల్లియా ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించేవాడు, కానీ కన్నపేగు బంధపు లోటును ఏదీ పూడ్చలేదు.

సుగుణ పట్టువదలకుండా చేసిన ప్రయత్నాలు చివరికి ఫలించాయి. అడవి సరిహద్దు గ్రామాల ద్వారా, పాత పరిచయాల ద్వారా వెతకగా ఒకరోజు వార్త వచ్చింది.. "నీ అమ్మ బతికే ఉంది సుగుణ!" అంతేకాదు, అమ్మ దగ్గర ఒక చిన్న ఫోన్ ఉందనే వార్తతో పాటు నంబర్ కూడా దొరికింది. ఆ క్షణంలో సుగుణ గుండె నాట్యం చేసింది. ఇరవై ఏళ్లుగా గడ్డకట్టుకుపోయిన కన్నీళ్లు ఒక్కసారిగా ఉప్పెనలా పొంగిపొర్లాయి. "మా అమ్మ ఉందోయ్! నాకూ మా అమ్మ ఉంది!" అని బిగ్గరగా ఏడుస్తూ, చిన్నపిల్లలా ఎగిరి గంతులేస్తూ పునరావాస కేంద్రంలో ఉన్న కామ్రేడ్స్ అందరికీ చెప్పుకుంది. అమ్మకు కంటిచూపు తగ్గిపోయిందని, ఈ వయసులో కూడా ఒంటరిగా తనే వండుకుని తింటోందని తెలిసినప్పుడు ఆమె గుండె మళ్లీ పిండేసినట్లయింది. "ఇక ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకూడదు... నా అమ్మను నేను తెచ్చుకుంటాను, నా కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటాను" అని నిర్ణయించుకుంది. ఆ కలల రోజు రానే వచ్చింది. ఒక వాహనం వచ్చి పునరావాస కేంద్రం ముందు ఆగింది. కారు తలుపు తెరుచుకుంది. అందులో నుంచి తూలిపడుతూ, ముడతలు పడిన శరీరంతో ఒక వృద్ధురాలు బయటకు దిగింది. ఆ రూపాన్ని చూడగానే సుగుణకు లోకం ఆగిపోయింది. ఇరవై ఏళ్ల కాలం ఒక్కసారిగా వెనక్కి నడిచింది. పరిగెత్తుకుంటూ వెళ్లింది. మసకబారిన చూపుతో అమ్మ కూడా తన ఒంటిలోని శక్తినంతటినీ కూడగట్టుకుని చేతులు చాచింది. "బిడ్డా..." అని పిలవాలని ఆ తల్లి తపించింది. కానీ నోటి నుంచి శబ్దం రాలేదు. పెదవులు మాత్రమే వణికాయి. ఇరవై ఏళ్ల వేదన ఆ గొంతును నొక్కిపడేసింది. సుగుణ పరిగెత్తి వెళ్లి అమ్మ గుండెలపై వాలిపోయింది. "అమ్మా... అమ్మా... యాయా..." అని వెక్కివెక్కి విలపించింది. అమ్మ తన వణుకుతున్న చేతులతో కూతురు తలను, వీపును గట్టిగా పట్టుకుంది. ఆ ఆలింగనంలో... ఇరవై ఏళ్ల విరహం, వర్షంలో తడిసిన రాత్రుల భయం, తూటాల సవ్వడులు, ఆకలి నరకాలు, మాతృత్వపు త్యాగాలు... అన్నీ కన్నీటి ధారలై కరిగిపోయాయి. అక్కడ నిలబడిన అధికారులు, తోటి కామ్రేడ్స్, గ్రామస్తులు... ఒక్కరూ కూడా కన్నీళ్లు ఆపుకోలేకపోయారు. ఆ వాతావరణమంతా ఒక పవిత్రమైన మానవీయ శోకంతో నిండిపోయింది.

"చూడండి... నాకూ మా అమ్మ ఉంది!" అమ్మను గట్టిగా పట్టుకుని, కన్నీళ్లు తుడుచుకుంటూ సుగుణ తన చుట్టూ ఉన్నవారందరి వైపు చూసింది. ఆమె ముఖంలో ఒక వింతైన, అద్భుతమైన ఆనందం. చిన్నపిల్లలా నవ్వుతూ, ఏడుస్తూ అందరికీ పరిచయం చేసింది. "ఇదిగో చూడండి... మా అమ్మ! నాకూ మా అమ్మ ఉంది!" ఆ ఒక్క మాటలో.. ఒక జీవితకాలపు దుఃఖం ఉంది. అనాథగా భావించిన ఒక కూతురి పరమానందం ఉంది. తల్లి కోసం గుండెలు చిట్లిన ఇరవై ఏళ్ల నిరీక్షణకు దక్కిన పరమార్థం ఉంది. కంటిచూపు కోల్పోతున్న ఆ కన్నతల్లికి ఇకపై సుగుణే చూపు! అమ్మను తనతోనే ఉంచుకుని, ఆమె పాదాలను కడుక్కుంటూ తన మిగిలిన జీవితాన్ని గడపాలనే నిశ్చయానికి వచ్చింది. అడవి ఒడిలో పోగొట్టుకున్న సర్వస్వాన్ని... నేడు ఆ అమ్మ కన్నీటి స్పర్శలో ఆమె తిరిగి పొందింది. ఈ కథను ఎవరు ఎలా అర్థం చేసుకుంటారో వారి ఇష్టం. రాజకీయ విశ్లేషకులకు ఇది మావోయిస్టు పార్టీ వ్యూహాత్మక మార్పుల నేపథ్య కథ కావచ్చు. చరిత్రకారులకు ఇది దండకారణ్యపు ఉద్యమ ఘట్టం కావచ్చు. కానీ... అన్నిటికంటే ముందు, ఇదొక అమ్మ-కూతుళ్ల ప్రేమానురాగాల కథ. తుపాకీ పట్టిన చేతులు కూడా... కన్నతల్లి తల నిమరాలని అనుక్షణం తపిస్తాయని చాటిచెప్పే కథ. విప్లవ నినాదాలతో అడవులను ఊపేసిన గొంతు కూడా... "అమ్మా..." అని పిలిచేటప్పుడు ఏమాత్రం మార్పు లేని ఒక పసిపాప గొంతుగానే మారుతుందని నిరూపించిన కథ. చరిత్ర యుద్ధాలను, వ్యూహాలను మాత్రమే గుర్తుంచుకుంటుంది. రాజకీయం సిద్ధాంతాలను మాత్రమే లెక్కిస్తుంది. కానీ మనిషి మనుగడ, ఈ సృష్టి మాత్రం... ఒక్క కన్నతల్లి కౌగిలిని మాత్రమే సత్యంగా గుర్తుంచుకుంటుంది. ఇరవై ఏళ్ల అడవి ప్రయాణం, ఉద్యమ క్రమశిక్షణ, సిద్ధాంతాలన్నీ ఒకెత్తయితే... బయటకు వచ్చాక తల్లి గుండెలపై తలవాల్చి "నాకూ మా అమ్మ ఉంది.." అని ఏడ్చిన ఆ ఒక్క క్షణం.. ఏ చరిత్రకైనా మించిన అత్యున్నత మానవీయ సత్యం.

– కృతి అందించిన సమాచారం ఆధారంగా..



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్,
9010128884

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.